మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU
దినపత్రిక

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

బుధవారం WEDNESDAY 12-11-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00
సంపుటి: 1 Volume:1 ‖ సంచిక: 133 Issue: 133

12 నవంబర్ 2025 - బుధవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - శరత్ ఋతువు కార్తీక మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:23 సూర్యాస్తమయం - సా. 5:37 తిథిః అష్టమి రా. 11:03 వరకు తరువాత నవమి సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం ఆశ్లేష సా. 6:37 వరకు తరువాత మఖ యోగం శుక్ల ఉ. 7:55 వరకు కరణం భాలవ ఉ. 11:01 వరకు కౌలవ రా. 11:03 వరకు వర్జ్యం ఉ. 7:15 నుండి ఉ. 8:52 వరకు దుర్ముహూర్తం ఉ. 11:37 నుండి మ. 12:22 వరకు రాహుకాలం మ. 12:00 నుండి మ. 1:24 వరకు యమగండం ఉ. 7:47 నుండి ఉ. 9:11 వరకు గుళికాకాలం ఉ. 10:35 నుండి మ. 12:00 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:47 నుండి తె. 5:35 వరకు అమృత ఘడియలు సా. 4:58 నుండి సా. 6:35 వరకు అభిజిత్ ముహూర్తం లేదుః గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com



## నడి రోడ్డుపై రౌడీయిజం

### పోలీసుల ముందే శ్రీశైలం యాదవ్ దాడి

### బీఆర్ఎస్ నేతలపై దురుసు ప్రవర్తన

జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ తండ్రి శ్రీశైలం యాదవ్ బరితెగించాడు. నడి రోడ్డుపై రౌడీయిజానికి దిగారు. దొంగ ఓట్లను అడ్డుకున్న బీఆర్ఎస్ నాయకులపై పోలీసుల ముందే శ్రీశైలం యాదవ్ దాడికి పాల్పడ్డారు.

జూబ్లీహిల్స్/హైదరాబాద్, నవంబర్ 11 (ఈవార్తలు): యూసుఫ్‌గూడలోని మహబూబ్ ఫంక్షన్ హాల్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దొంగ ఓటర్లను అడ్డుకున్న బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పట్ల పోలీసులు అమర్యాదగా ప్రవర్తించారు. దీంతో -2 వ పేజీలో...



## పట్టపగలే రిగ్గింగ్

### దయచేసి బయటకు రండి

### బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత

జూబ్లీహిల్స్‌లో రిగ్గింగ్ జరుగుతోందని, ఓటర్లను భయపెడుతున్నారని మాగంటి సునీత అన్నారు. జూబ్లీహిల్స్‌లో పలుచోట్ల రౌడీషీటర్లు తిరుగుతున్నారని ఆరోపించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారని వ్యాఖ్యానించారు.

జూబ్లీహిల్స్/హైదరాబాద్, నవంబర్ 11 (ఈవార్తలు): ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకు జూబ్లీహిల్స్‌లో ఏం పని అని అడిగారు. మరోవైపు ఎన్నికల కమిషనర్‌ను మాగంటి సునీత రిక్వెస్ట్ చేశారు. ఎన్నికల కమిషనర్ దయచేసి బయట రండి అని, పరిస్థితి సమీక్షించాలని చెప్పారు. ఒక మహిళను ఇలా చేస్తుంటే కూడా చూస్తూ ఊరుకున్నారన్నారు. ఏది కరెక్ట్‌గా ఉందో చెప్పి, చేయించాలన్నారు. పోలీసులు కూడా గొడవలు చేశారని ఆరోపించారు.




## కోడ్ ఉల్లంఘించిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

### కేసు నమోదు చేసిన ఎన్నికల సంఘం.. బీఆర్ఎస్ అభ్యర్థి సునీతపైనా కాంగ్రెస్ ఫిర్యాదు

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్ర నాయక్‌పై మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. 2

# బీజేపీ..



# అక్కడ పెబ్బ.. ఇక్కడ బెబ్బె

### బీహార్‌లో ఎన్డీయే గెలుపు.. జూబ్లీహిల్స్‌లో మూడో స్థానం

### అభ్యర్థి ప్రకటన మొదలు వెనుకంజే.. రేవంత్ కోసమే బీజేపీ కాంప్రమైజ్!

తెలంగాణలో అధికారం అంటేనే బీజేపీకి ఇష్టం లేనట్లుగా ఉంది. 2023 ఎన్నికలకు ముందు నుంచి ఆ పార్టీ వ్యూహాలు ప్రజలకు అస్సలు అంతుపట్టడం లేదు. ప్రజలకే కాదు.. ఆ పార్టీ నేతలకూ అంతుపట్టడం లేదు. తాజాగా, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలోనూ ఆ పార్టీ కొందరికి ఫేవర్ చేసేలా పావులు కదిపినట్లు తెలుస్తోంది. సీఎం రేవంత్‌తో సన్నిహిత సంబంధాలు నెరపడం వల్లే బీజేపీ నాయకత్వం.. రేవంత్‌కు మద్దతు ఇచ్చేలా ముందుకు వెళ్తోందని బహిరంగంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

హైదరాబాద్/పాట్నా/న్యూఢిల్లీ: అసలేం జరిగిందంటే.. బీహార్‌లో ఎన్డీయే దూసుకెళ్లగా, జూబ్లీహిల్స్‌లో మాత్రం తనకేమీ పట్టనట్లుగా వ్యవహరించింది. అభ్యర్థి ప్రకటన మొదలు.. ప్రచారం, ఓటు అభ్యర్థన, పోలింగ్ మేనేజ్‌మెంట్ వరకు.. వెనుకబడింది. దీంతో సొంత పార్టీ నేతలే అధినాయకత్వం తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం విడుదలైన బీహార్ ఎగ్జిట్ పోల్స్‌లో ఎన్డీయే మరోసారి ఘన విజయం సాధించబోతోందని ముక్తకంఠంతో చెప్పాయి. ఆర్జేడీ-కాంగ్రెస్ కూటమి అయిన మహాగట్బంధన్ కూటమికి తీవ్ర నిరాశ తప్పదని అంచనా వేశాయి. వివిధ జాతీయ సర్వే సంస్థలు విడుదల చేసిన ఎగ్జిట్ పోల్స్ ప్రకారం, ఎన్డీయేకు 130 నుంచి 167 సీట్ల వరకు దక్కే అవకాశం ఉంది. మరోవైపు, మహాగట్బంధన్ కూటమి 70 నుంచి 108 స్థానాల మధ్య పరిమితం కావొచ్చని తెలుస్తోంది. బీహార్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి 122 సీట్ల మేజిక్ ఫిగర్ అవసరం కాగా, ఎన్డీయే సునాయాసంగా ఆ మార్కును దాటుతుందని సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ఎన్నికల్లో ప్రభావం చూపుతారని భావించిన రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ 'జన్ సురాజ్' పార్టీ ఏమాత్రం సత్తా చాటలేకపోయిందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. చాలా సర్వేలు ఆయన పార్టీకి 0 నుంచి 5 సీట్ల లోపే వస్తాయని పేర్కొన్నాయి. దీంతో, బీహార్ రాజకీయాలపై 'పీకే ఫ్యాక్టర్' పనిచేయలేదని విశ్లేషకులు భావిస్తున్నారు. మ్యాట్రిజ్ ఎగ్జిట్ పోల్ ప్రకారం, మిథిలాంచల్, భాగల్‌పూర్ వంటి ప్రాంతాల్లో ఎన్డీయే ప్రభంజనం సృష్టించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా, 65 శాతం మంది మహిళా ఓటర్లు ఎన్డీయేకు తరువాయి 2 వ పేజీలో...

బీహార్‌లో ఎగ్జిట్ పోల్స్ ఇలా..

| పీపుల్స్ ఇన్ సైట్ | |
|---|---|
| ఎన్డీయే | 133-148 |
| మహాకూటమి | 87-102 |
| జన్ సురాజ్ | 0-2 |
| ఇతరులు | 3-6 |
| **జేవీసీ పోల్స్** | |
| ఎన్డీయే | 135-150 |
| మహాకూటమి | 88-103 |
| జన్ సురాజ | 0 |
| ఇతరులు | 3-6 |

# జూబ్లీహిల్స్ హస్తమయం!

### కాంగ్రెస్‌కు ఎగ్జిట్ పోల్స్ పట్టం

### ఎడ్జ్‌లో నిలిచిన బీఆర్ఎస్.. కనీస పోటీ ఇవ్వని బీజేపీ

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక పోలింగ్ ముగిసింది. పలు సర్వే సంస్థలు తమ ఎగ్జిట్ పోల్స్ ఫలితాలను ప్రకటించాయి. ప్రధానంగా రెండు పార్టీల మధ్యే పోటీ అని ఎగ్జిట్ పోల్స్ తేల్చాయి. ఇప్పటి వరకు సర్వేలు కాంగ్రెస్ పార్టీ వైపే మ్నొగ్గు చూపాయి. బీఆర్ఎస్ నుంచి మాగంటి గోపినాథ్ సతీమణి సునీత పోటీ చేశారు. కాంగ్రెస్ నుంచి నవీన్ యాదవ్, బీజేపీ నుంచి దీపక్ రెడ్డి బరిలో నిలిచారు. ఎంఐఎం పార్టీ అధికార కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చింది. ఈనెల 14న జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఓట్ల లెక్కింపు జరగనుంది.

ఎగ్జిట్ పోల్స్ ఇలా..

- చాణక్య స్ట్రాటజీస్: కాంగ్రెస్ - 46 శాతం, బీఆర్ఎస్ - 41 శాతం, బీజేపీ - 6 శాతం
- పబ్లిక్ పల్స్ : కాంగ్రెస్-48 శాతం, బీఆర్ఎస్-41 శాతం, బీజేపీ-6 శాతం
- స్మార్ట్ పోల్: కాంగ్రెస్- 48.2 శాతం, బీఆర్ఎస్-42.1 శాతం
- నాగన్న సర్వే: కాంగ్రెస్‌కు 47 శాతం, బీఆర్ఎస్ 41 శాతం, బీజేపీ 8 శాతం
- హెచ్ఎంఆర్ సర్వే: హస్తం పార్టీకి 48.3 శాతం, బీఆర్ఎస్‌కు 43.18 శాతం, బీజేపీ 5.84 శాతం

### బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.12,584 |
| వెండి (గ్రాము): | రూ.170 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,519 |


### విశ్వవాణి



నటుడు గ్యారీ సినిస్ ప్రతి సంవత్సరం వెయ్యికిపైగా పిల్లలను డిస్నీ వరల్డ్‌కు ఉచితంగా తీసుకెళ్తాడు. ఆయన తీసుకెళ్లేవారిలో అంతా యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన సైనికుల పిల్లలే ఉండటం విశేషం.

# డాక్టర్లే ఉగ్రవాదులు!

- 13కు చేరిన ఢిల్లీ పేలుడు మృతుల సంఖ్య
- ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన ఢిల్లీ సర్కారు
- నిందితులను వదిలిపెట్టం: ప్రధాని మోదీ
- ప్రతి ఉగ్రవాదిని వేటాడుతాం: అమిత్ షా
- కేసు ఎన్ఐఏకు బదిలీ చేస్తూ ఆదేశాలు
- పేలుడులో కీలకంగా టెలిగ్రామ్ యాప్
- జైషే మహ్మద్ మహిళా విభాగం హస్తం!



ఢిల్లీ పేలుడులో డాక్టర్లే అసలు నిందితులు అని దర్యాప్తు సంస్థలు ప్రాథమికంగా నిర్ధారించాయి. సోమవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనలో 13 మంది మృతి చెందగా.. అనేక మంది గాయపడ్డారు. ఈ ఘటనపై పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అనుమానితుడు ఫోటోను కూడా విడుదల చేశారు. టెలిగ్రామ్ యాప్ ద్వారా పేలుడుకు కుట్ర జరిగినట్టు భావిస్తున్నారు.

న్యూఢిల్లీ:ఆత్మాహుతి బాంబర్‌గా అనుమానిస్తున్న డాక్టర్ ఉమర్ మహ్మద్, టెలిగ్రామ్ యాప్‌లో సమన్వయం చేసుకునే ఒక తీవ్రవాద డాక్టర్ల గ్రూప్‌లో సభ్యుడిగా ఉన్నాడు. పోలీసుల సమాచారం ప్రకారం.. ఉమర్‌కు పాక్ ఉగ్రవాద సంస్థ జైషే మహమ్మద్‌తో సంబంధాలు ఉన్నాయి. గత కొద్ది రోజులుగా జైషే ఉగ్ర మాడ్యూల్‌లో కీలక పాత్రధారులుగా భావిస్తున్న మరో ఇద్దరు డాక్టర్లు అరెస్టవడంతో భయాందోళనకు గురై, ఆత్మాహుతి పేలుడు జరిపినట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. అయితే, మొత్తం కుట్ర అంతా టెలిగ్రామ్ యాప్ ద్వారా అమలు చేసినట్టు అనుమానిస్తున్నారు. తరువాయి 2 వ పేజీలో...



# అందెశ్రీ అమర్ రహే!

### ప్రజా కవి అంత్యక్రియలు పూర్తి

### పాడె మోసిన సీఎం రేవంత్ రెడ్డి

ఘట్‌కేసర్/హైదరాబాద్, నవంబర్ 11 (ఈవార్తలు): ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో పూర్తయ్యాయి. ఘట్‌కేసర్‌లోని ఎన్ఎఫ్‌సీ నగర్‌లో అశ్రు నయనాల మధ్య అంత్యక్రియలు జరిగాయి. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నేతలు హాజరు అయ్యారు. అందెశ్రీ పాడెను సీఎం రేవంత్ రెడ్డి మోశారు. మంత్రులు శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ హాజరు అయ్యారు. అశ్రు నయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసులు మూడుసార్లు గాలిలోకి కాల్పులు జరిపిన తర్వాత తరువాయి 2 వ పేజీలో...



## ఆరుగురు నక్సల్స్ హతం

### ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

- భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు
- బీజాపూర్ జిల్లాలోని దట్టమైన అటవీ ప్రాంతంలో ఘటన
- భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం

బస్తర్/వైజాగ్, నవంబర్ 11 (ఈవార్తలు): ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. బీజాపూర్ జిల్లాలోని దట్టమైన అటవీ ప్రాంతంలో మంగళవారం భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన భీకర ఎదురుకాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఆపరేషన్ మావోయిస్టుల కార్యకలాపాలను అణచివేయడంలో కీలక ముందడుగు అని పోలీసు అధికారులు వెల్లడించారు. పక్కా నిఘా సమాచారంతో ఈ ఆపరేషన్ ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. బీజాపూర్, దంతెవాడ జిల్లాల డిస్ట్రిక్ట్ తరువాయి 2 వ పేజీలో...



## నెల్లూరులో ముగ్గురు దుర్మరణం

### చేపల లోడ్ లారీ బీభత్సం

నెల్లూరు: నెల్లూరులో కంటైనర్ లారీ బీభత్సం సృష్టించింది. చేపల లోడుతో వెళ్తున్న లారీ అదుపు తప్పి.. మినీ వ్యాను, 3 బైక్‌లతో పాటు ఓ చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతిచెందగా.. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. నెల్లూరులోని ఎన్టీఆర్ నగర్ వద్ద జాతీయ రహదారిపై ఈ ఘటన చోటుచేసుకుంది. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. చెన్నై నుంచి విజయవాడవైపు వెళ్తున్న కంటైనర్ లారీ నియంత్రణ తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు



12.11.2025

మేషం: దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. సంతాన ఉద్యోగ ప్రయత్నాలకు మందకోడిగా సాగుతాయి. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. చేపట్టిన పనులలో ఆటంకాలు ఉంటాయి. ఆర్థిక ఇబ్బందులు అధిగమించడానికి నూతన రుణ ప్రయత్నాలు చేస్తారు.

వృషభం: వృత్తి వ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి. మానసిక ఆందోళనతో కొంత చికాకు పరుస్తాయి. స్థిరాస్థి కొనుగోలు ప్రయత్నాలు వాయిదా వేస్తారు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్త అవసరం చేపట్టిన పనులలో జాప్యం తప్పదు. వివాదాలకు దూరంగా ఉండటం మంచిది.

మిధునం: ఇతరుల వ్యవహారాలలో జోక్యం చేసుకోకపోవడం మంచిది. సంఘంలో గౌరవం పెరుగుతుంది. సోదరుల సహాయ సహకారాలతో కొన్ని వ్యవహారాలు పూర్తి చేస్తారు. వృత్తి ఉద్యోగాలలో మీ ప్రతిభ వెలుగులోకి వస్తుంది. నూతన వస్తు, ఆభరణాలను కొనుగోలు చేస్తారు. చిన్ననాటి మిత్రుల తో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు.

కర్కాటకం: అవసరానికి చేతిలో ధనం నిల్వ ఉండదు. కోపాన్ని అదుపులో ఉంచుకోవడం మంచిది. కుటుంబ సభ్యులతో దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. కొందరు ప్రవర్తన వలన మానసిక ఆందోళనలు తప్పవు. నేత్ర సంబంధిత అనారోగ్యాలను కొంత బాధిస్తాయి.

సింహం: మానసికంగా మరింత ఉత్సాహంగా ఉంటారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ అవసరానికి ధన సహాయం లభిస్తుంది. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. సంతాన వివాహ విషయమై గృహమున ప్రస్తావన వస్తుంది. వృత్తి ఉద్యోగాలలో నూతన అవకాశాలు లభిస్తాయి.

కన్య: మీ ఆలోచనలు ఇతరులకు నచ్చే విధంగా ఉండవు. నిరుద్యోగ ప్రయత్నాలు నిరుత్సాహపరుస్తాయి. ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. దైవ కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. నూతన రుణ ప్రయత్నాలు కలసి రావు. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు ఉంటాయి.

తుల: ఇతరులకు సైతం సహాయ సహకారాలు అందిస్తారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి. దూరప్రాంత బంధుమిత్రులు ఆగమనం ఆనందం కలిగిస్తుంది. ఆకస్మిక ధనలాభ సూచనలు ఉన్నవి. దీర్ఘకాలిక రుణాలు తీర్చగలుగుతారు. వృత్తి వ్యాపారాల్లో ఆశించిన లాభాలు అందుకుంటారు.

వృశ్చికం: వృత్తి వ్యాపారంలో విశేషలాభాన్ని ఆర్జిస్తారు. బంధు, మిత్రుల సహాయ సహకారాలు లభిస్తాయి. ఒక వ్యవహారానికి సంబంధించి ముఖ్యమైన సమాచారాన్ని సేకరిస్తారు. నూతన వస్త్రా భరణాలను కొనుగోలు చేస్తారు. ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి. ఆర్థిక ఇబ్బందులు అధిగమించి ముందుకు సాగుతారు.

ధనస్సు: ఇంటా బయట విలువ మరింత పెరుగుతుంది. సమాజంలో పేరు కలిగిన వ్యక్తుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. కొన్ని విషయాలను ధైర్యంగా నిర్ణయాలు తీసుకుని ముందుకు సాగుతారు. వృత్తి ఉద్యోగాలు అనుకూలిస్తాయి. కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు. దైవానుగ్రహం తో కొన్ని పనులు పూర్తవుతాయి.

మకరం: బంధు మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. ఆకస్మిక ధన లాభ సూచనలు ఉన్నవి. అనారోగ్య సమస్యల నుంచి ఉపశమనం కలుగుతుంది. కుటుంబ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. చాలా కాలంగా పూర్తికాని పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

కుంభం: ఆర్థిక పరిస్థితి మరింత నిరుత్సాహపరుస్తుంది. వృత్తి ఉద్యోగాలలో పని ఒత్తిడి పెరుగుతుంది. ఇతరుల వ్యవహారాలలో జోక్యం చేసుకోకపోవడం మంచిది. సోదరులతో వివాదాలకు దూరంగా ఉ ండటం మంచిని. స్వల్ప అనారోగ్య సమస్యను ఉంటాయి. ప్రయాణాల్లో వ్యయ ప్రయాసలు తప్పవు.

మీనం: సమాజంలో పేరు, ప్రతిష్ఠలు పెరుగుతాయి. రుణబాధలు నుండి ఉపశమనం పొందుతారు. జీవిత భాగస్వామితో పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. నిరుద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆరోగ్యం మెరుగవుతుంది. ఇతరులకు సహాయ సహకారాలు అందిస్తారు. స్త్రీ సంబంధిత ధన లాభ సూచనలు ఉన్నవి.

# అక్కడ పెబ్బ.. ఇక్కడ బెబ్బె

మొదటి పేజీ తరువాయి

మద్దతుగా నిలిచినట్లు ఈ సర్వే వెల్లడించింది. అలాగే, 51 శాతం ఓబీసీలు, 49 శాతం ఎస్సీ ఓటర్లు కూడా ఎన్డీయే వైపే మొగ్గు చూపినట్లు పేర్కొంది. మొత్తం 243 అసెంబ్లీ స్థానాలున్న బీహార్‌లో రెండు విడతల్లో పోలింగ్ జరిగింది. వెలువడిన ఎగ్జిట్ పోల్స్ అంచనాలు ఈ విధంగా ఉన్నప్పటికీ, పూర్తి ఫలితాలు తెలియాలంటే ఓట్ల లెక్కింపు వరకు వేచి చూడాల్సిందే. బీహార్ లో మొత్తం 243 స్థానాలకు గాను... నవంబరు 6న జరిగిన తొలి విడతలో 121 స్థానాలకు పోలింగ్ జరిగింది. మంగళవారం రెండో విడతలో మిగిలిన 122 స్థానాలకు పోలింగ్ చేపట్టారు. పోలింగ్ సాయంత్రం 6 గంటలకు ముగియగానే, ఎగ్జిట్ పోల్స్ వెల్లడయ్యాయి. అయితే, జూబ్లీహిల్స్ విషయానికి వచ్చేసరికి డిపాజిట్ దక్కే అవకాశాలు కూడా గగనమే అన్న అనుమానాలు మొదలయ్యాయి. ఆ పార్టీ అభ్యర్థి ఏ దశలోనూ పోటీ ఇవ్వలేదన్న అభిప్రాయాలు వెల్లువెత్తాయి. అభ్యర్థి అనేకంటే.. పార్టీ అధినాయకత్వమే జూబ్లీహిల్స్‌ను లైట్ తీసుకుందని అంటున్నారు.

మ్యాట్రిజ్
ఎన్డీయే 147-167
మహా కూటమి 70-90
జన్ సురాజ్ 0-2
ఇతరులు 2-8

దైనిక్ భాస్కర్
ఎన్డీయే 145-160
మహాకూటమి 73-91
జన్ సురాజ్ 0
ఇతరులు 5-10

పీపుల్స్ పల్స్
ఎన్డీయే 133-159
మహా కూటమి 75-101
జన్ సురాజ్ 0-5

పి-మార్క్
ఎన్డీయే 142-162
మహాకూటమి 80-98
జన్ సురాజ్ 1-4
ఇతరులు 0-3



చాణక్య స్ట్రాటజీస్
ఎన్డీయే 130-138
మహాకూటమి 100-108
జన్ సురాజ్ 0
ఇతరులు 3-5

డీవీ రీసెర్చ్
ఎన్డీయే 137-152
మహా కూటమి 83-98
జన్ సురాజ్ 2-4
ఇతరులు 1-8





## కోడ్ ఉల్లంఘించిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

### కేసు నమోదు చేసిన ఎన్నికల సంఘం.. బీఆర్ఎస్ అభ్యర్థి సునీతపైనా కాంగ్రెస్ ఫిర్యాదు

జూబ్లీహిల్స్/హైదరాబాద్, నవంబర్ 11 (ఈవార్తలు):జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్ర నాయక్‌పై మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, రామచంద్ర నాయక్, మాలోత్ రాందాస్‌తో పాటు ఎమ్మెల్సీ శంకర్ పోలింగ్ బూత్‌కు రావడంపై ఎన్నికల సంఘం సీరియస్ అయింది. ఓటర్లను ప్రభావితం చేసేలా తిరుగుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. అటు.. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతపై ఎలక్షన్ కమిషన్‌కి కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది. ప్రెస్‌మీట్‌పై కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. మాగంటి సునీత ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారంటూ ఫిర్యాదు చేసింది. ఎన్నిక జరుగుతుండగానే ప్రెస్‌మీట్ పెట్టారని పేర్కొంది.



## నడి రోడ్డుపై రౌడీయిజం

మొదటి పేజీ తరువాయి

పోలీసులపై బీఆర్ఎస్ కార్యకర్తలు మండిపడ్డారు. పాడి కౌశిక్ రెడ్డిని అరెస్టు చేయగా, మాగంటి సునీతను అక్కడ్నుంచి పంపించారు. కానీ రౌడీయిజానికి దిగిన శ్రీశైలం యాదవ్‌ను మాత్రం పోలీసులు అరెస్టు చేయలేదు. పైగా ఆయనకు పోలీసులు భద్రత కల్పించడం గమనార్హం.

## ఆరుగురు నక్సల్స్ హతం

మొదటి పేజీ తరువాయి

రిజర్వ్ గార్డ్ (డీఆర్జీ), స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్టీఎఫ్) బృందాలు సంయుక్తంగా అడవుల్లోకి వెళ్లాయి. ఉదయం 10 గంటల సమయంలో భద్రతా బలగాలను గమనించిన మావోయిస్టులు కాల్పులు ప్రారంభించగా, బలగాలు దీటుగా ఎదురుకాల్పులు జరిపాయి. సాయంత్రం వరకు కాల్పులు అడపాదడపా కొనసాగాయి. ఈ ఘటనలో ఇప్పటివరకు ఆరుగురు మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని బీజాపూర్ ఎస్పీ జితేంద్ర యాదవ్ ధృవీకరించారు. ఘటనా స్థలం నుంచి ఇన్సాస్ రైఫిల్స్, స్టెన్ గన్స్, .303 రైఫిల్స్‌తో పాటు భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు. మావోయిస్టుల యూనిఫాంలు, కమ్యూనికేషన్ పరికరాలు, విప్లవ సాహిత్యం పుస్తకాలు కూడా లభించాయని తెలిపారు. ఈ ఆపరేషన్‌పై బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ స్పందించారు. "ప్రస్తుతం మావోయిస్టు సంస్థ నాయకత్వం, దిశానిర్దేశం లేకుండా నైతికంగా దెబ్బతింది. కేవలం అబూజ్‌మఢ్ అడవుల్లోని కొన్ని ప్రాంతాలకే వారి ఉనికి పరిమితమైంది. నిఘా ఆధారిత ఆపరేషన్ల విజయానికి ఇది నిదర్శనం" అని ఆయన వ్యాఖ్యానించారు. తప్పించుకున్న మావోయిస్టులు పొరుగు జిల్లాల్లోకి ప్రవేశించకుండా అదనపు బలగాలను మోహరించి, అడవులను జల్లెడ పడుతున్నామని ఆయన తెలిపారు.

# అందెశ్రీ అమర్ రహే!

మొదటి పేజీ తరువాయి

అంతిమ సంస్కారాలు జరిగాయి. అంతకుముందు లాలాపేటలోని అందెశ్రీ నివాసం నుంచి తార్నాక, ఉప్పల్ మీదుగా ఘట్‌కేసర్ వరకు అంతిమయాత్ర జరిగింది. మాజీ ఎంపీలు హనుమంతరావు, సర్వే సత్యనారాయణ, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య విమలక్క పాల్గొని భౌతికకాయానికి నివాళులు అర్పించారు. అందెశ్రీ సతీమణి మల్లుబాయి , కుమార్తెలు వాక్కులమ్మ, వెన్నెల, వేకువ, కుమారుడు దత్తు సంప్రదాయం పద్ధతిలో కర్మకాండలను నిర్వహించగా...అధికారిక లాంఛనాలతో అందెశ్రీ అంత్యక్రియలు పూర్తయ్యాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందెశ్రీ కుటుంబ సభ్యులను ఓదార్చారు. అంతిమయాత్ర కార్యక్రమాన్ని దగ్గరుండి పరిశీలించారు. అందెశ్రీ రాసిన ప్రతీ పాట ప్రజా జీవితంలో నుంచి పుట్టికొచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అందెశ్రీ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని చెప్పారు. అందెశ్రీ స్మృతివనం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రాష్ట్రా సాధనలో అందెశ్రీ పాత్ర మరువలేనిదన్నారు. 'రక్తాన్ని చెమటగా, పాటగా మార్చి ప్రజలకు అందించారు. అందెశ్రీది నాది సోదర అనుబంధం. ఆయన లేకపోవడం నాకు వ్యక్తిగతం లోటు' అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

అందెశ్రీకి పద్మశ్రీ ఇవ్వాలి: సీఎం

కవి, ప్రముఖ రచయిత అందెశ్రీకి పద్మశ్రీ ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. గత ఏడాది కేంద్రానికి లేఖ కూడా రాశామని...ఈ సంవత్సరం కూడా కేంద్రానికి లేఖ రాస్తాం అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అందెశ్రీకి పద్మశ్రీ గౌరవం దక్కేలా కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి సహకరించాలి అని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలుగా వారిని పద్మశ్రీ తో గౌరవించుకునేందుకు కృషి చేద్దాం అని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. గద్దర్ అన్నతో పాటు అందెశ్రీ కూడా ప్రజల్లో స్ఫూర్తి నింపారు అని చెప్పుకొచ్చారు. ఆయన రాసిన ప్రతీ పాట తెలంగాణలో స్ఫూర్తిని నింపింది అని అన్నారు. 'అందెశ్రీ రాసిన "జయ జయహే తెలంగాణ" గీతాన్ని పాఠ్యాంశంగా చేర్చేందుకు మంత్రివర్గంలో నిర్ణయం తీసుకుంటాం. ఆయన పేరుతో ఒక స్మృతి వనాన్ని ఏర్పాటు చేస్తాం. వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది' అని పేర్కొన్నారు.

## నెల్లూరులో ముగ్గురు దుర్మరణం

మొదటి పేజీ తరువాయి

కోల్పోవడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. మృతులను నజీమ్ మొహిద్దీన్ (67), షేక్ ముజాహిద్ అలీ (36), వి. సురేశ్ (36) గా గుర్తించారు. వీళ్లంతా నెల్లూరు రూరల్‌లోని సిరి గార్డెన్‌కు చెందినవారు. సంఘటన స్థలికి చేరుకున్న పోలీసులు రహదారిపై వాహనాలను తొలగించి.. రాకపోకలను పునరుద్ధరించారు. జిల్లా ఎస్పీ అజిత్ సంఘటన స్థలిని పరిశీలించారు. లారీ ముందు భాగం చెట్టుకు తగలడంతో నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంపై ఏపీ మంత్రి నారాయణ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు.

# డాక్టర్లే ఉగ్రవాదులు!

మొదటి పేజీ తరువాయి

ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది యూజర్లకు టెలిగ్రామ్ ఒక సాధారణ, భద్రత కలిగిన సోషల్ మీడియా లేదా మెసేజింగ్ యాప్‌లా కనిపిస్తుంది. కానీ, గోప్యతకు ప్రాధాన్యం ఇచ్చే ప్లాట్‌ఫారంగా తనను పరిచయం చేసుకుంటున్న ఎన్‌క్రిప్టెడ్ యాప్, వాస్తవానికి ఉగ్రవాద కార్యకలాపాలు, నేరచర్యలు, తప్పుడు సమాచార వ్యాప్తి, చిన్నారులపై లైంగిక దుర్వినియోగ కంటెంట్, జాతివివక్షతకు కేంద్రబిందువుగా మారుతోందని నివేదికలు చెబుతున్నాయి. అటు.. పేలుడులో మృతిచెందిన వారి కుటుంబాలకు ఢిల్లీ ప్రభుత్వం ఆర్థిక సాయం ప్రకటించింది. మృతులకు ఒక్కొక్కరికి రూ.10 లక్షలు, శాశ్వతంగా వైకల్యం ఏర్పడిన వారికి రూ.5 లక్షలు, క్షతగాత్రులకు రూ.2 లక్షలు చొప్పున అందజేయనున్నట్టు తెలిపింది. పూర్తిగా కోలుకునేవరకూ గాయపడినవారికి చికిత్స బాధ్యతను ప్రభుత్వమే చూసుకుంటుందని వెల్లడించింది.

కుట్రదారులను వదలం: మోదీ

ఎర్రకోట వద్ద పేలుళ్లకు తెగబడినవాళ్లను ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హెచ్చరించారు. భూటాన్‌లో మోదీ ప్రసంగిస్తూ.. ఈ ఘటనపై భద్రతా దళాలు దర్యాప్తును ముమ్మరం చేశాయని తెలిపారు. పేలుడుకు గల కారణాలు త్వరలోనే దర్యాప్తు అధికారులు వెల్లడిస్తారని మోదీ అన్నారు. అమాయకులను పొట్టనబెట్టుకున్న వారిపై ప్రతీకారం తీర్చుకుంటామని దేశ ప్రజలకు హామీ ఇస్తున్నట్లు ప్రధానిపేర్కొన్నారు. ఈ ఘటనలో మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేశారు.

ప్రతి ఉగ్రవాదిని వేటాడుతాం: అమిత్ షా

పేలుడు వెనుక ఉన్న ప్రతి కుట్రదారుడినీ వేటాడాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఆదేశాలు జారీ చేశారు. దీని వెనుకున్న ప్రతి ఒక్కరూ.. భద్రతా బలగాల పూర్తి ఆగ్రహాన్ని ఎదుర్కొంటారని ఆయన హెచ్చరించారు. అమిత్ షా నివాసంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు. హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్, ఐబీ డైరెక్టర్ తపన్ కుమార్, ఢిల్లీ పోలీస్ కమిషనర్ సతీష్ గోల్చా, ఎన్ఐఏ డైరెక్టర్ జనరల్ సదానంద్ వసంత్ పాల్గొన్నారు. కాగా, ఇప్పటికే అమిత్ షా పేలుడు జరిగిన స్థలాన్ని పరిశీలించారు. అటు.. ఘటనపై పోలీసులు ప్రాథమిక నివేదికను కేంద్రానికి అందజేశారు. ఈ ఘటనలో ఆత్మాహుతి బాంబర్‌గా అనుమానిస్తున్న డాక్టర్ ఉమర్ మహమ్మద్‌కు పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థ జైషే మహమ్మద్‌తో సంబంధాలు ఉన్నట్టు రిపోర్ట్ ఇచ్చారు. ఈ క్రమంలోనే కేసును జాతీయ దర్యాప్తు సంస్థకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా అప్పగించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. దీంతో.. ఎన్ఐఏ రంగంలోకి దిగింది. ఫరీదాబాద్‌లోని అల్ ఫతాహ్ యూనివర్సిటీకి చెందిన మరో ముగ్గురు వైద్యులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ పేలుడు వెనుక పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థ జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్థ వ్యవస్థాపకుడు మసూద్ అజార్ సోదరి నాయకత్వం వహిస్తోన్న జమాత్ ఉల్ మొమినాత్‌తో సంబంధం ఉన్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లక్నోకు చెందిన లేడీ డాక్టర్



షహీనా షాహిద్ భారత్‌లో దానికి చీఫ్‌గా ఉన్నట్టు గుర్తించారు. ఉగ్రదాడులకు ఆమె సహకారం అందిస్తున్నట్టు తెలిసింది. ఆమెను అరెస్ట్ చేశారు. పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థ జైషే మహమ్మద్ భారత్‌లో మహిళా విభాగం ఏర్పాటు, నియామకాల్లో డాక్టర్ షహీనా కీలక పాత్ర పోషించినట్టు ఢిల్లీ పోలీసు వర్గాలు వెల్లడించాయి.

# భట్టి.. పిఠాపురంలో పోస్టర్ రిలీజ్

హైదరాబాద్, నవంబర్ 11 (ఈవార్తలు): 'ప్రేయసి రావే' ఫేమ్ మహేష్‌చంద్ర దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'పిఠాపురంలో'. దీనికి ఉపశీర్షిక 'అలా మొదలైంది'. డా. రాజేంద్రప్రసాద్, పృథ్వీరాజ్, కేదార్ శంకర్,మణిచందన, సన్నీ అఖిల్, విరాట్, సాయిప్రణీత్ , శ్రీలు, ప్రత్యూష తదితరులు ఈ చిత్ర ప్రధాన తారాగణం. మహేష్‌చంద్ర సినిమా టీమ్ పతాకంపై దుండిగల్ల బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్ఎం మురళి (గోదారి కిట్టయ్య) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ "ఈ సినిమా కాన్సెప్ట్ గురించి దర్శకులు చెప్పారు. మంచి సందేశాత్మక చిత్రంగా అనిపిస్తోంది. యువతరం కుటుంబ సమేతంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలి, ఎలా ఎదగాలనే సందేశం ఈ సినిమాలో ఉంది. ఈ చిత్రాన్ని అందరూ



ఆదరించాలి" అని చెప్పారు. డా. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ "ఇవాళ సమాజంలో ఏం జరుగుతుందనే పాయింట్‌ని దర్శకుడు మహేష్‌చంద్ర అద్భుతంగా డీల్ చేశాడు. స్టోరీ నచ్చి నేను కూడా ఇష్టంగా ఈ సినిమా చేశాను. 'ఆ నలుగురు', 'మీ శ్రేయోభిలాషి', 'ఓనమాలు' తరహాలోనే సందేశాన్ని అందిస్తూనే యువతరాన్ని ఆకట్టుకునే అంశాలున్న సినిమా ఇది" అని తెలిపారు. నటుడు పృథ్వీరాజ్ మాట్లాడుతూ "ఇది మూడు కుటుంబాల కథ. ఈ ఇంటర్‌నెట్ యుగంలో తల్లిదండ్రులంటే గౌరవం కనబరచని యువతకు కనువిప్పు కలిగించే చిత్రం ఇది" అని పేర్కొన్నారు. దర్శకుడు మహేష్‌చంద్ర మాట్లాడుతూ "నా తొలి సినిమా 'ప్రేయసి రావే' నాకెంతో గొప్ప పేరు తీసుకొచ్చింది. ఈరోజుకీ ప్రేక్షకుల గుండెల్లో నిలిచిపోయి ఉంది. 'పిఠాపురంలో' సినిమా కూడా అదే స్థాయిలో నిలిచిపోయే సినిమా. నా మనసుకి నచ్చిన కథ ఇది. ముగ్గురు తండ్రుల కథలా అనిపిస్తూనే మూడు జంటల మధ్య నడిచే కథ ఇది. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ గారి నియోజకవర్గమైన 'పిఠాపురం' పేరుతోనే ఈ సినిమా తీశాం. ఈ టైటిల్‌ని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కగారు ఆవిష్కరించడం చాలా చాలా సంతోషంగా ఉంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ చివరి దశలో ఉంది. వచ్చే నెలలోనే ఈ చిత్రాన్ని విడుదల చేస్తాం" అని తెలిపారు.



## మూడు రోజుల పాటు ఎర్రకోట బంద్

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో ఉన్న ఎర్రకోట సమీపంలో సోమవారం రాత్రి ఏడు గంటలకు కారు పేలుడు ఘటన జరిగిన విషయం తెలిసిందే. ఆ పేలుడు ధాటికి 13 మంది మృతిచెందగా, 20 మంది వరకు గాయపడ్డారు. అయితే ఈ నేపథ్యంలో ఎర్రకోటను బంద్ చేశారు. రాబోయే మూడు రోజుల పాటు విజిటర్స్‌కు ఎర్రకోట బంద్ ఉంటుందని అధికారులు చెప్పారు. ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా దీనిపై ప్రకటన చేసింది. కారు బాంబు పేలుడు జరిగిన ప్రదేశంలో ప్రస్తుతం ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్ జరుగుతున్నది. అయితే ప్రజలు భారీ స్థాయిలో గుమ్మికూడే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎర్రకోటను బంద్ చేస్తున్నట్లు ఏఎస్ఐ ప్రకటించింది. కారు పేలుడుకు, ఫరీదాబాద్ టెర్రర్ మాడ్యూల్‌కు లింకు ఉన్నట్లు ప్రాథమిక విచారణ ద్వారా వెల్లడవుతున్నది. పేలడు కోసం డిటోనేటర్లు వాడినట్లు అనుమానిస్తున్నారు. అమోనియం నైట్రేట్ రసాయనం వాడి ఉంటారని భావిస్తున్నారు. సూసైడ్ బాంబర్ డాక్టర్ ఉమర్ మహమ్మద్ పేలుడుకు ముందు తన కారును ఎర్రకోట పార్కింగ్ ఏరియాలో సుమారు మూడు గంటల పాటు పార్కింగ్ చేశాడు. పేలుడు విచారణ చేపడుతున్న పోలీసులు.. పుల్వామాలో ఉన్న డాక్టర్ ఉమర్ ఫ్యామిలీని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనతో లింకున్న నలుగుర్ని ఇప్పటి వరకు అరెస్టు చేశారు. రెడ్‌ఫోర్ట్ మెట్రో స్టేషన్‌ను మంగళవారం మూసివేశారు.

## జూబ్లీహిల్స్‌లో 48.24 % పోలింగ్

హైదరాబాద్, నవంబర్ 11 (ఈవార్తలు) : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో 48.24 శాతం పోలింగ్ నమోదైనట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. పురుషులు 47.59 శాతం మంది, మహిళలు 48.95 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గత ఎన్నికలను పరిశీలిస్తే.. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో 52.76 శాతం, 2014లో 50.18 శాతం, 2018లో 45.59 శాతం, 2023లో 47.58 శాతం పోలింగ్ నమోదైంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో మొత్తం 4,01,365 ఓటర్లు, ఇందులో పురుషులు 2,08,561 మంది, మహిళలు 1,92,779 మంది ఉన్నారు.

# జూబ్లీహిల్స్‌లో 20 వేల బోగస్ ఓట్లు

### ఈసీతో రేవంత్ రెడ్డి కుమ్మక్కు.. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపణలు

హైదరాబాద్, నవంబర్ 11 (ఈవార్తలు) : జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో 20 వేల బోగస్ ఓట్లు ఉన్నాయని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు స్పందించలేదు అని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్‌తో రేవంత్ రెడ్డి కుమ్మక్కై ఈ ఉప ఎన్నికలో అరాచకం సృష్టించారని ఆర్ఎస్పీ మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో డాక్టర్ దాసోజు శ్రవణ్‌తో కలిసి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయాలని గత మూడు నాలుగు నెలల నుంచి ఎన్నికల కమిషన్, ప్రభుత్వం కలిసి కుట్ర పన్నినట్లు స్పష్టంగా అర్థమవుతుంది. 40 రోజుల క్రితం బీఆర్ఎస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులం కలిసి 20 వేల బోగస్ ఓట్లను సృష్టించుకున్నారని, ఈ ఓట్లతో గెలవాలని చూస్తున్నారని చెప్పి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశాం. ఇంత వరకు బోగస్ ఓటర్లను పట్టుకోలేకపోయారు. ఇది కుట్రకు మొదటి సంకేతం. ఇక రెండో కుట్ర.. ఎన్నికల వేళ ఏదైనా ఉల్లంఘన జరిగితే సీవిజిల్ యాప్ ద్వారా వెంటనే ఫొటో తీసి వీడియో తీసి అప్‌లోడ్ చేయాలి. ఈ సీ విజిల్ ఈ రోజు కూడా పని చేయడం లేదు. నేను, శ్రవణ్, కౌశిక్ రెడ్డి కలిసి




ఎలక్షన్ అధికారులను కలిసి ఫిర్యాదు చేశాం. సీ విజిల్ యాప్ పని చేయడం లేదని చెప్పాం. కేంద్ర ఎన్నికల సంఘం ఆధీనంలో ఉంటుందని చెప్పారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఇక మూడోది.. బోగస్ ఓటింగ్ జరిగే ప్రాంతాలపై ఉదాహరణలతో ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసి అదనపు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించాం. షేక్ పేట్ డివిజన్‌లోని చాలా బూత్‌ల వద్ద బందోబస్తు పెట్టలేదు. బోగస్ ఓటర్లు వివరాలను లైవ్‌గా చెప్పినా కూడా పోలీసులు వారి ఆపలేదు. ఎగ్జిట్ పాయింట్ వద్ద బోగస్ ఓటర్లకు అనుమతించారు అని ఆర్ఎస్పీ పేర్కొన్నారు. బోగస్ ఓటర్లు అంతా ఆటోల్లో వచ్చారు. వారి వద్ద జిరాక్స్ కాపీ ఐడీలు ఉన్నాయి. ఈ ఓటర్ పేరుకు అసలైన ఓటరు పేరుకు తేడా ఉంది. వివరాలు సరిగ్గా చెప్పడం లేదు. పోలీసులు, అధికారులు అవేమీ అడగకుండా ఓట్లు వేయిస్తున్నారు. ఇవాళ వేల బోగస్ ఓటర్లను తీసుకొచ్చి ఓట్లు వేయించారు. 13 ఏండ్ల అమ్మాయితో కూడా ఓటు వేయించారు. అది అడిగినందుకు పావని గౌడ్, చింతా ప్రభాకర్ మీద దాడి చేశారు. కాంగ్రెస్ నేతలకు ఒక న్యాయం..? బీఆర్ఎస్ నేతలకు ఒక న్యాయమా..? ఎన్నికల కమిషన్‌తో రేవంత్ రెడ్డి కుమ్మక్కయ్యారు. బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేశారు. మధురానగర్ పోలీసు స్టేషన్‌లో బైండోవర్‌లో ఉన్న శ్రీశైలంను ఓటు వేసిన తర్వాత ఇంట్లో కూర్చోపెట్టాలి.. లేదా పీఎస్‌లో పెట్టాలి. కానీ ఉదయం నుంచి సాయంత్రం వరకు బూత్ నంబర్ 244 నుంచి 251 దాకా శ్రీశైలం యాదవ్ అరాచకం సృష్టించారని పేర్కొన్నారు.

# కోమటిరెడ్డి.. రాబందు ట్రైలర్ రిలీజ్

**సమాజంలోని ఘటనల ఆధారంగా తెరకెక్కిన చిత్రం**

**ప్రధాన పాత్రలను పోషించిన ప్రీతి నిగమ్, రామ్**

హైదరాబాద్, నవంబర్ 11 (ఈవార్తలు): ప్రీతి నిగమ్, రామ్, భాను ప్రసాద్, సురేశ్ రాజ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న కొత్త చిత్రం 'రాబందు'. జయశేఖర్ కల్లు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా ట్రైలర్‌ను తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి విడుదల చేశారు. పులిజాల ఫిల్మ్స్ పతాకంపై పులిజాల సురేశ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సినిమా విడుదలకు సిద్ధమైన నేపథ్యంలో చిత్ర యూనిట్ ట్రైలర్ లాంచ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి ట్రైలర్‌ను ఆవిష్కరించి చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రముఖ దర్శకుడు సముద్ర ఒక లిరికల్ సాంగ్‌ను విడుదల చేయగా, నటి ప్రీతి నిగమ్ టీజర్‌ను లాంచ్ చేశారు. ఈ వేడుకలో సెన్సార్ బోర్డు సభ్యులు ఉపేంద్ర, రేణు కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్శకుడు జయశేఖర్ కల్లు మాట్లాడుతూ..



"సమాజంలో జరుగుతున్న కొన్ని వాస్తవ ఘటనల ఆధారంగా భారీ యాక్షన్ నేపథ్యంలో 'రాబందు' చిత్రాన్ని నిర్మించాం. మా సినిమా ట్రైలర్‌ను మంత్రి కోమటిరెడ్డి గారు విడుదల చేయడం చాలా సంతోషంగా ఉంది. నిర్మాత సురేశ్ గారు నాపై నమ్మకంతో ఈ అవకాశం ఇచ్చారు. సినిమా అద్భుతంగా వచ్చింది. నటీనటులు, సాంకేతిక నిపుణుల సహకారంతోనే ఇది సాధ్యమైంది. త్వరలో విడుదల కానున్న మా చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలని కోరుతున్నాను" అని తెలిపారు. అనంతరం దర్శకుడు సముద్ర మాట్లాడుతూ.. "దర్శకుడు జయశేఖర్ నాకు మంచి స్నేహితుడు. ఇది ఆయనకు నాలుగో సినిమా. 'యానిమల్' సినిమా లాగే 'రాబందు' అనే టైటిల్ చాలా మాస్‌గా, వైలెంట్‌గా ఉంది. టైటిల్‌కు తగ్గట్టే సినిమా కూడా ఉంటుందని ఆశిస్తున్నా. ఈ చిత్రం నటీనటులతో పాటు నిర్మాత, దర్శకుడికి మంచి విజయాన్ని అందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అన్నారు. ఆయన వ్యాఖ్యలతో సినిమాపై ఆసక్తి పెరిగింది.

# కరప్షన్‌లో ఉత్తమ్ నం.1

**బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్**





జగిత్యాల, నవంబర్ 11 (ఈవార్తలు): తెలంగాణ క్యాబినెట్ మినిస్టర్లలో ఉత్తమ్ కుమార్ రెడ్డి కరప్షన్ చేయడంలో నెంబర్ 1 అని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ సెన్సేషనల్ కామెంట్స్ చేశారు. జిల్లా అభివృద్ధిపై నిర్వహించే దిశ కమిటీ మీటింగ్‌లో పాల్గొనేందుకు జగిత్యాలకు వచ్చిన ఎంపీ సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడారు. క్యాబినెట్లో ఉత్తమ్ కుమార్ చేసినంత కరప్షన్ ఎవరు చేయరు అంటూ విమర్శించారు. జగిత్యాలకు మంజూరైన కేంద్రీయ విద్యాలయానికి ఇరిగేషన్ శాఖకు సంబంధించిన భూమిని ఎందుకు అలాట్ చేయడం లేదని ప్రశ్నించారు. భూమి కేటాయించేందుకు కూడా ఆయనకు వాటాలు కావాలేమో అంటూ ఎద్దేవా చేశారు. మరోవైపు పేదలకు ఇస్తున్న రేషన్ బియ్యంలో సింహాభాగం కేంద్రం ఇస్తున్నవేనని కిలో బియ్యానికి 32 రూపాయలకు కేంద్రం ఇస్తే 3 రూపాయలు రాష్ట్రం ఇస్తుందన్నారు. అలాంటప్పుడు మోడీ ఫోటో పెట్టడానికి ఉన్న అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. ఇదే విషయమై కలెక్టర్‌ను ప్రశ్నిస్తే ఆయన కూడా నీళ్లు నమ్ములుతున్నారని అన్నారు. కేంద్రం ఇస్తున్న బియ్యం పంపిణీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సంచులు ప్రింట్ చేసుకొని సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫోటోలు వేసుకున్నారన్నారు. నిజామాబాద్ పార్లమెంటు పరిధిలో జగిత్యాలకు అధికంగా నిధులు వచ్చాయని తెలిపిన ఎంపీ కోరుట్లలో నవోదయ, జగిత్యాలకు కేంద్రీయ విద్యాలయం తీసుకువచ్చినట్లు తెలిపారు.

## జూబ్లీహిల్స్.. వందల కోట్ల బెట్టింగ్..!

**జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య హోరాహోరీ**

**ఫలితాలపై భారీ స్థాయిలో బెట్టింగులు**

**బీహార్ ఎన్నికల ఫలితాలపై కూడా బెట్టింగులు**



హైదరాబాద్, నవంబర్ 11 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాల కోసం రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తుండటం, అత్యధికంగా సెటిలర్ ఓటర్లు ఉన్న నియోజకవర్గం కావడంతో ఈ ఉప ఎన్నికకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది. ఈ ఎన్నికల్లో 58 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా, ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల అభ్యర్థుల మధ్య పోటీ నెలకొంది. ముఖ్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య హోరాహోరీ పోరు కనిపించింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాలపై భారీ స్థాయిలో బెట్టింగ్‌లు జరిగినట్లు సమాచారం. దాదాపు 500 కోట్ల రూపాయల వరకు బెట్టింగ్‌లు జరిగాయని తెలుస్తోంది. గెలుపుతో పాటు మెజార్టీపై కూడా బెట్టింగ్‌లు వేసినట్లు చెబుతున్నారు. బీహార్ ఎన్నికల ఫలితాలపై కూడా పెద్ద ఎత్తున బెట్టింగ్ కాశారని సమాచారం. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను అన్ని ప్రధాన పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. హోరాహోరీగా ప్రచారం నిర్వహించాయి. ఆయా పార్టీలకు చెందిన కీలక నేతలు ప్రచారంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ప్రచారం చేశారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీ గెలుపొందే అవకాశాలు ఉన్నాయని ఎగ్జిట్ పోల్ సర్వేలు తెలుపుతున్నాయి.

## జూబ్లీహిల్స్ ఓటర్లకు కేటీఆర్ థాంక్స్

**మాగంటి సునీత గెలుపు కోసం కృషి చేశారంటూ కార్యకర్తలకు ప్రశంస**



హైదరాబాద్, నవంబర్ 11 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసిన పార్టీ కార్యకర్తలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ పోలింగ్ ముగిసిన అనంతరం ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించారు. "గత నెల రోజులుగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గెలుపు కోసం శక్తివంచన లేకుండా పనిచేసిన పార్టీ నేతలు, కార్యకర్తలకు పేరుపేరునా కృతజ్ఞతలు. అధికార పార్టీ ఎన్ని దౌర్జన్యాలకు పాల్పడినా, భయభ్రాంతులకు గురిచేసినా బయటకు వచ్చి ఓటు వేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు" అని ఆయన పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో 58 మంది బరిలో నిలిచారు. కాంగ్రెస్ నుంచి నవీన్ యాదవ్, బీఆర్ఎస్ నుంచి మాగంటి సునీత, బీజేపీ నుంచి లంకల దీపక్ రెడ్డి పోటీ చేశారు. ప్రధానంగా వీరి ముగ్గురి మధ్య పోటీ నెలకొంది. ఎగ్జిట్ పోల్ సర్వే ఫలితాలు కూడా వెలువడ్డాయి.

## మాదే గెలుపు: టీపీపీసీ చీఫ్



హైదరాబాద్, నవంబర్ 11 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల పోలింగ్, ఎగ్జిట్ పోల్ ఫలితాలపై తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఈ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ భారీ విజయం సాధించబోతోందని ఆయన జోస్యం చెప్పారు. అన్ని ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని ఆయన అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలంతా నవీన్ యాదవ్ వైపు నిలిచారని ఆయన పేర్కొన్నారు. ఉప ఎన్నికల ప్రక్రియ మొదలైనప్పటి నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమను ముందుండి నడిపించారని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. నవీన్ యాదవ్ తప్పకుండా గెలుస్తారని, ఆయన విజయం కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికీ టీపీసీసీ చీఫ్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంలో తాము సఫలీకృతం చెందామని ఆయన అన్నారు.

## వాళ్లు డాక్టర్లు కాదు.. టెర్రరిస్టులు: రాజా సింగ్



హైదరాబాద్, నవంబర్ 11 (ఈవార్తలు): ఢిల్లీలో జరిగిన పేలుడు ఘటనపై గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ తీవ్రంగా స్పందించారు. నిందితులుగా భావిస్తున్న కొందరి పేర్లను ప్రస్తావిస్తూ, వారు డాక్టర్లు కాదని, దేశంలో విధ్వంసం సృష్టించేందుకు సిద్ధమైన ఉగ్రవాదులని సంచలన ఆరోపణలు చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ఆ వీడియోలో రాజా సింగ్ మాట్లాడుతూ.. "డాక్టర్ ముజమ్మిల్ షకీల్, డాక్టర్ ఆదిల్ అహ్మద్, డాక్టర్ షాహీన్, డాక్టర్ మొహియుద్దీన్ సయీద్, డాక్టర్ మొహమ్మద్ ఉమర్.. ఈ పేర్లు వింటే వీరంతా ఏదో వైద్య బృందం అని మీరు అనుకోవచ్చు. కానీ వీరు రోగుల ప్రాణాలను కాపాడే వైద్యులు కాదు. వీరంతా దురాశతో ఏర్పడిన, 72 మంది 'జన్నత్ మిషన్' సిబ్బంది. అంటే, వారందరూ ఉగ్రవాదులు" అని ఆరోపించారు. భారత్‌లో డిగ్రీలు సంపాదించి, లక్షల రూపాయలు ఖర్చు చేసి చదువుకున్నప్పటికీ, వారి మనసుల్లో మత విషం నిండిపోయిందని రాజా సింగ్ విమర్శించారు. "అంతిమంగా డాక్టర్ కాకుండా ఉగ్రవాదిగా మారడానికే అయితే, ఈ చదువుల నాటకం ఎందుకు? హిందువులను మోసం చేయడానికే ఇదంతా. ఈ దేశద్రోహులకు ఇళ్లు, రేషన్, ఆయుష్మాన్ కార్డులు వంటి లక్షల విలువైన సౌకర్యాలు కల్పించినా ప్రయోజనం లేదు" అని అన్నారు. చివరికి ఈ జిహాదీలు మదర్సాల్లో వారికి శిక్షణ ఇచ్చిన పనులనే చేస్తారని, వారి అసలు స్వరూపం అదేనని రాజా సింగ్ తన వీడియోలో తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

## గృహప్రవేశం చేస్తే లక్ష

**హిజ్రాల డిమాండ్.. ఓ కుటుంబంపై దాడి**

హైదరాబాద్, నవంబర్ 11 (ఈవార్తలు): కొత్త ఇల్లు కట్టుకుని గృహప్రవేశం చేసిన ఓ కుటుంబంపై హిజ్రాలు దాడి చేశారు. రూ. లక్ష ఇవ్వాలని డిమాండ్ చేయగా అంత ఇవ్వలేనడంతో అసభ్యంగా దూషించారు. అక్కడి నుంచి వెళ్లిపోయిన హిజ్రాలు.. ఆ తర్వాత మూడు ఆటోల్లో గుంపుగా వచ్చి కర్రలు, రాళ్లతో దాడి చేశారు. కీసర మండలం చీర్యాల్ లో చోటుచేసుకుందీ దారుణం. వివరాల్లోకి వెళితే.. చీర్యాల్ లోని శ్రీబాలాజీ ఎన్క్లేవ్ లో ప్రమిదల సదానందం ఇటీవల కొత్త ఇల్లు కట్టుకున్నాడు. బంధుమిత్రుల సమక్షంలో సంతోషంగా గృహప్రవేశం నిర్వహించాడు. ఈ క్రమంలో ఆదివారం ఇంటిముందు సదానందం పనిచేస్తుండగా ఇద్దరు హిజ్రాలు వచ్చారు. కొత్త ఇల్లు కట్టుకున్నారు మాకు డబ్బులు ఇవ్వాలని అడిగారు. ఎంతోకొంత ఇచ్చి పంపిద్దామని చూస్తే ఒప్పుకోలేదు. రూ.లక్ష ఇవ్వాలని పట్టుబట్టారు. అంత మొత్తం ఇవ్వలేనని సదానదం చెప్పడంతో అసభ్యంగా దూషించి వెళ్లిపోయారు. కాసేపటి తర్వాత మూడు ఆటోల్లో 15 మంది హిజ్రాలు వచ్చారు. ఇంటి గేటును ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారు. శబ్దం విని బయటకు వచ్చిన సదానందంతో పాటు ఆయన కుటుంబ సభ్యులపై కర్రలు, రాళ్లతో దాడి చేశారు. ఈ గొడవను గమనించి చుట్టుపక్కల వారు రావడంతో హిజ్రాలు పారిపోయారు. హిజ్రాల దాడిలో గాయపడ్డ సదానందం ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నాక కీసర పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హిజ్రాల ఆగడాలు హెచ్చుమీరుతున్నాయని, పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## బెల్లంకొండ సురేశ్‌పై భూకబ్జా కేసు

హైదరాబాద్, నవంబర్ 11 (ఈవార్తలు): ప్రముఖ టాలీవుడ్ నిర్మాత బెల్లంకొండ సురేశ్‌పై భూకబ్జా ఆరోపణలతో కేసు నమోదైంది. హైదరాబాద్‌లోని ఖరీదైన ఫిల్మ్‌నగర్ ప్రాంతంలో తన ఇంటిని సురేశ్, ఆయన అనుచరులు అక్రమంగా ఆక్రమించుకున్నారని ఆరోపిస్తూ శివ ప్రసాద్ అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే.. ఫిల్మ్‌నగర్ రోడ్ నం.7లో ఉన్న తన ఇంటికి శివ ప్రసాద్ తాళం వేసి, కొంతకాలంగా బంధువుల వద్ద ఉంటున్నారు. ఇదే అదనుగా భావించిన బెల్లంకొండ సురేశ్, తన మనుషులతో కలిసి ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించారని ఆయన ఆరోపించారు. అంతేకాకుండా ఇంట్లోని ఫర్నిచర్‌తో పాటు ఇతర సామగ్రిని ధ్వంసం చేసి, గోడలను పాడుచేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కొన్నాళ్ల తర్వాత ఇంటికి తిరిగి వచ్చిన శివ ప్రసాద్, లోపలి దృశ్యాలు చూసి దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ విషయంపై మాట్లాడేందుకు తన సిబ్బందిని బెల్లంకొండ సురేశ్ ఇంటికి పంపగా, అక్కడ తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుందని, వారిపై దాడికి కూడా ప్రయత్నించారని ఆయన వివరించారు. శివ ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఫిల్మ్‌నగర్ పోలీసులు.. బెల్లంకొండ సురేశ్‌పై బీఎన్ఎస్ 329(4), 324(5), 351(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే, ఈ తీవ్ర ఆరోపణలపై బెల్లంకొండ సురేశ్ వైపు నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.



## కొండగట్టుకు పోటెత్తిన జనం

మల్యాల, నవంబర్ 11 (ఈవార్తలు): కొండగట్టుకు అంజన్న భక్తులు పోటెత్తారు. మంగళవారం నేపథ్యంలో భక్తులు అధిక సంఖ్యలో వచ్చి వేకువజామునే కోనేరులో స్నానాలు ఆచరించి , తలనీనాలు సమర్పించారు. కార్తీకమాసం సందర్భంగా గండ దీపం వద్ద 365 వత్తులతో దీపలు వెలిగించారు. తరువాత స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అటు.. దేవాలయంలో ఆర్జిత సేవలో భాగంగా మొదటగా సుప్రభాత సేవలో పలువురు భక్తులు పాల్గొన్నారు. ఈవో సమక్షంలో 12 మంది భక్తులు టికెట్లు తీసుకొని సేవలో పాల్గొన్నారు. ఈ సేవ పూర్తి స్థాయిలో 15 నుంచి అందుబాటులోకి రానుంది.




## అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు.. పొలాల దారి

వేములవాడ, నవంబర్ 11 (ఈవార్తలు): వేములవాడ నుంచి కోరుట్ల వస్తున్న ఆర్టీసీ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే కథలాపూర్ మండలం ఇప్పపెల్లి సమీపంలో రహదారిపై ఇండియన్ గ్యాస్ సిలిండర్లతో వస్తున్న లారీని తప్పించే క్రమంలో డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దీంతో ఆర్టీసీ బస్సు ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్ల పొదల్లోకి దూసుకుపోయింది. ఈ ఆకస్మిక పరిణామంతో బస్సులో ఉన్న ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అదృష్టవశాత్తు బస్సు వేగం అదుపులోనే ఉండటం, చెట్ల పొదల్లోకి దూసుకుపోవడం వలన బస్సు బోల్తా పడకుండా నిలిచింది. ఈ ప్రమాదంలో కొంతమంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సహాయంతో గాయపడిన వారికి ప్రాథమిక చికిత్స అందించారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

## తిరుపతి లడ్డూ హిందువుల విశ్వాసం

**సనాతన ధర్మ పరిరక్షణ బోర్డును ఏర్పాటు చేయాలి**

**ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్**

అమరావతి, నవంబర్ 11 (ఈవార్తలు): సనాతన ధర్మాన్ని, హిందువుల మనోభావాలను పరిరక్షించేందుకు 'సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు'ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రపంచవ్యాప్త హిందూ సమాజానికి కేవలం పుణ్యక్షేత్రం మాత్రమే కాదని, అదొక పవిత్రమైన ఆధ్యాత్మిక గమ్యస్థానం అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ స్పందిస్తూ, "తిరుపతి లడ్డూ కేవలం ఒక స్వీట్ కాదు, అది మనందరి ఉమ్మడి భావోద్వేగం. స్నేహితులు, కుటుంబ సభ్యులు, చివరికి అపరిచితులతో కూడా మనం ఆ ప్రసాదాన్ని పంచుకుంటాం. ఎందుకంటే, అది మన సామూహిక విశ్వాసానికి, ప్రగాఢ భక్తికి ప్రతీక" అని వివరించారు. ఏటా సగటున 2.5 కోట్ల మంది భక్తులు తిరుమలను సందర్శిస్తారని గుర్తుచేశారు. "సనాతనుల మనోభావాలను, ఆచారాలను ఎగతాళి చేసినప్పుడు లేదా కించపరిచినప్పుడు అది కేవలం బాధ కలిగించడమే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది భక్తుల నమ్మకాన్ని, విశ్వాసాన్ని దెబ్బతీస్తుంది. లౌకికవాదం అనేది రెండు వైపులా ఉండాలి. మా విశ్వాసానికి రక్షణ, గౌరవం ఇవ్వడంలో రాజీ పడకూడదు" అని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. మన సనాతన ధర్మం అత్యంత పురాతనమైన, నిరంతరం అభివృద్ధి చెందుతున్న నాగరికత అని పేర్కొన్న పవన్, భాగస్వాములందరి ఏకాభిప్రాయంతో 'సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు'ను స్థాపించడానికి ఇదే సరైన సమయమని ఆయన అభిప్రాయపడ్డారు. అంతకుముందు, నటుడు ప్రకాశ్ రాజ్ సోషల్ మీడియాలో తిరుపతి లడ్డూ అంశంపై తనదైన శైలిలో స్పందించారు. "పాలు లేని కల్తీ నెయ్యిలో మతోన్మాదాన్ని కలపకుండా, కల్తీ రాజకీయం చేయకుండా ఇప్పటికైనా తప్పు చేసిన వాడిని శిక్షించే పని చూడండి" అంటూ ట్వీట్ చేశారు.

# పవన్‌ది రాజకీయ భక్తి

**చంద్రబాబును రక్షించడానికే ధర్మంపై వ్యాఖ్యలు**

**ముందు నిలకడగా ఉండటం నేర్చుకోవాలి**

**తిరుమలకు బోర్డులు కాదు నిజాయతీ అవసరం**

**మాజీమంత్రి రోజా కీలక వ్యాఖ్యలు**



అమరావతి, నవంబర్ 11 (ఈవార్తలు): సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు ఏర్పాటు చేయాలంటూ ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై వైసీపీ నేతల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా, ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి రోజా కూడా పవన్ తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పవన్ కల్యాణ్ ధర్మం గురించి మాట్లాడటం కేవలం రాజకీయ నటన అని, అందులో ఏమాత్రం చిత్తశుద్ధి లేదని ఆమె ఆరోపించారు. "పవన్ కళ్యాణ్ గారూ, మీరు పవిత్రత, ధర్మం గురించి మాట్లాడిన ప్రతీసారి మీ పక్షపాత వైఖరి స్పష్టంగా బయటపడుతుంది. మీ ఆందోళన కేవలం ఎంపిక చేసుకున్న అంశాలకే పరిమితమని తెలిసిపోతుంది. తిరుమలలో భక్తులు చనిపోయినప్పుడు గానీ, వ్యవస్థలో తీవ్రమైన లోపాలు బయటపడినప్పుడు గానీ మీ నోరు పెగలలేదు. కానీ, ఎప్పుడైతే చంద్రబాబుకు ఒక రక్షణ కవచం అవసరమవుతుందో, అప్పుడు హఠాత్తుగా మీరు ధర్మం గురించి ప్రవచనాలు మొదలుపెడతారు. దీన్ని భక్తి అనరు, స్వచ్ఛమైన రాజకీయ నటన అంటారు. మీరు నిజాయతీ గురించి మాట్లాడతారు, కానీ నిజాయతీ అంటే మనకు అసౌకర్యంగా ఉన్నప్పుడు కూడా నిజాన్ని నిర్భయంగా చెప్పగలగడం. మీరు ఆ పని ఎప్పుడూ చేయలేదు. మీ సొంత మిత్రపక్షాల నుంచి జవాబుదారీతనం రాబట్టాల్సిన సమయం వచ్చినప్పుడు మౌనంగా ఉంటూ, సులభమైన లక్ష్యాలను ఎంచుకుని విమర్శలు చేస్తారు. అందుకే మీ ధర్మోపన్యాసాలు డొల్లగా వినిపిస్తున్నాయి. ధర్మం గురించి గొప్ప ప్రసంగాలు ఎవరైనా ఇవ్వగలరు. కానీ అసలైన అవసరం వచ్చినప్పుడు దాని కోసం నిలబడే ధైర్యం ఎవరికి ఉంది అన్నదే అసలైన ప్రశ్న. ఆ పరీక్షలో మీరు ప్రతీసారీ విఫలమయ్యారు. తిరుమల సమస్యలను ఏదో ఒక బోర్డు లేదా కమిటీ పరిష్కరించదు. చిత్తశుద్ధి, నిజాయతీ మాత్రమే పరిష్కరించగలవు. కానీ ఆ రెండూ మీ రాజకీయాల్లో కొరవడ్డాయి. ఇతరులకు నీతులు చెప్పే ముందు, ముందు మీరు నిలకడగా ఉండటం నేర్చుకోండి. తిరుమలకు కావాల్సింది చిత్తశుద్ధి... మీలాంటి వారి స్క్రిప్టెడ్ ఆక్రోశాలు కాదు" రోజా హితవు పలికారు.

## విజయనగరం ఉగ్ర కుట్ర కేసులో ఇద్దరిపై చార్జిషీట్

**సోషల్ మీడియా ద్వారా ఉగ్రవాదం వైపు ఆకర్షిస్తున్నారని ఆరోపణ**

విజయనగరం, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన విజయనగరం టెర్రర్ కుట్ర కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కీలక ముందడుగు వేసింది. ఈ కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులపై విశాఖపట్నంలోని ఎన్ఐఏ ప్రత్యేక కోర్టులో మంగళవారం చార్జిషీట్ దాఖలు చేసింది. నిందితుల్లో ఒకరు విజయనగరం జిల్లాకు చెందిన సిరాజ్ ఉర్ రహ్మాన్ కాగా, మరొకరు తెలంగాణలోని హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ సమీర్. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల ద్వారా దేశవ్యాప్తంగా యువతను ఉగ్రవాదం వైపు ప్రేరేపించి, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా పలు ప్రాంతాల్లో దాడులకు కుట్ర పన్నారనేది వీరిపై ప్రధాన ఆరోపణ. ఈ మేరకు వారిపై భారతీయ న్యాయ సంహిత , పేలుడు పదార్థాల చట్టం, చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద అభియోగాలు నమోదు చేశారు. గత మే 16, 17 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ పోలీసులు సిరాజ్, సమీర్‌లను అరెస్ట్ చేశారు. అనంతరం కేసు తీవ్రత దృష్ట్యా ఎన్ఐఏ దర్యాప్తును చేపట్టింది. నిందితులు ఐసిస్ భావజాలంతో ప్రభావితమై, ఇన్‌స్టాగ్రామ్, సిగ్నల్ వంటి యాప్‌లలో పలు గ్రూపులు క్రియేట్ చేసి వందలాది మంది యువతను లక్ష్యంగా చేసుకుని విద్వేష ప్రచారానికి పాల్పడినట్లు ఎన్ఐఏ దర్యాప్తులో తేలింది. దేశ సమగ్రత, భద్రత, మత సామరస్యానికి భంగం కలిగించేలా వీరి కార్యకలాపాలు సాగాయని అధికారులు చార్జిషీట్‌లో పేర్కొన్నారు. ఈ కుట్ర వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోందని ఎన్ఐఏ ఒక ప్రకటనలో తెలిపింది. ఇదిలా ఉండగా, పాకిస్థాన్‌తో సంబంధాలున్న విశాఖపట్నం నేవీ గూఢచర్యం కేసులో మరో ఇద్దరు నిందితులకు ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు శిక్ష ఖరారు చేసింది. విశాఖపట్నం జిల్లాకు చెందిన కలవలపల్లి కొండబాబు, హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రా జిల్లాకు చెందిన అవినాశ్ సోమల్‌కు 5 సంవత్సరాల 10 నెలల సాధారణ జైలు శిక్ష విధించింది. యూఏపీఏ సెక్షన్ 18, అధికార రహస్యాల చట్టంలోని సెక్షన్ 3 కింద కోర్టు వీరిని దోషులుగా తేల్చింది. దీంతో పాటు ఇద్దరికీ చెరో రూ. 5,000 జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మరో ఏడాది జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని కోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది.




## విజయవంతంగా యూనిటీ 150 ర్యాలీ

**ఉక్కు మనిషికి ఘన నివాళి.. పాల్గొన్న ఎంపీ అర్వింద్, కలెక్టర్ సత్యప్రసాద్**

జగిత్యాల, నవంబర్ 11 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలో యూనిటీ 150 ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ ధర్మపురి అర్వింద్ పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి అర్వింద్ మాట్లాడుతూ.. సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి వల్లనే ఈరోజు అఖండ భారతదేశం ఐకమత్యంగా ఉందని తెలిపారు. మహనీయుల జీవిత చరిత్ర ప్రతి ఒక్కరూ తెలుసుకొని స్ఫూర్తి పొందాలని పిలుపునిచ్చారు. సర్దార్ పటేల్ స్ఫూర్తితోనే కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు భారతదేశాన్నీ ఐక్యం చేసిందని వెల్లడించారు. ప్రధానమంత్రి మోదీ పిలుపుమేరకు ప్రతి జిల్లాలోని పాదయాత్రలు చేపడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి పాదయాత్రను ప్రారంభించారు. పాదయాత్ర భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ బ్యాండ్‌తో ప్రారంభమై జగిత్యాల న్యూ బస్ స్టేషన్ సర్కిల్ నుంచి స్వామి వివేకానంద స్టేడియం వరకు కొనసాగింది. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బీ రాజాగౌడ్, ఆర్డీవో మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.



## విదే దేశాభివృద్ధికి మూలం: బీఎస్ లత

జగిత్యాల టౌన్, నవంబర్ 11 (ఈవార్తలు): విద్య ద్వారానే జ్ఞానం లభిస్తుందని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన మైనారిటీ సంక్షేమ దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్వాతంత్రం వచ్చిన తరువాత మొట్ట మొదటి నెహ్రూ నాయకత్వంలోని క్యాబినెట్‌లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారని, ఆయన పుట్టినరోజు సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవంగా వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పేదరికం విద్యతో మాత్రమే దూరమవుతుందని భావించి, ప్రతి పేదవాడికి విద్య అందే దిశగా ఆజాద్ చర్యలు తీసుకున్నారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ శాఖ అధికారి చిత్రూ, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## జగిత్యాల వ్యాప్తంగా పోలీసుల తనిఖీలు

జగిత్యాల టౌన్, నవంబర్ 11 (ఈవార్తలు): కేంద్ర హెూం శాఖ దేశవ్యాప్తంగా హై అలర్ట్ ప్రకటించిన నేపథ్యంలో జగిత్యాల జిల్లావ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేశారు. ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాలతో వాహన తనిఖీలు, రైల్వే స్టేషన్, బస్ స్టేషన్లు, జన సమూహం ఎక్కువగా ఉండే పరిసరాల్లో బాంబ్ స్క్వాడ్, పోలీసు జాగిలాలతో విస్తృత తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద వస్తువులు, ప్యాకేజీలు, సంచులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మట్లాడుతూ.. ప్రజల సహకారంతోనే భద్రతా చర్యలు సమర్థవంతంగా కొనసాగుతాయని అన్నారు. హై అలర్ట్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు లేదా వాహనాలు కనిపించిన సందర్భంలో వెంటనే సమీప పోలీస్ స్టేషన్, లేదా 100 నెంబర్ కి కు సమాచారం అందించాలని సూచించారు.

## వైవీ సుబ్బారెడ్డికి సిట్ నోటీసులు

విజయవాడ, నవంబర్ 11 (ఈవార్తలు): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడారన్న ఆరోపణలకు సంబంధించిన కేసులో దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. ఈ కేసు విచారణలో భాగంగా టీటీడీ మాజీ చైర్మన్, వైసీపీ సీనియర్ నేత వైవీ సుబ్బారెడ్డికి ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నోటీసులు జారీ చేసింది. ఈ నెల 13వ తేదీన తమ ముందు విచారణకు హాజరు కావాలని ఆ నోటీసులలో స్పష్టంగా పేర్కొంది. వైవీ సుబ్బారెడ్డి టీటీడీ చైర్మన్‌గా పదవిలో ఉన్న సమయంలోనే శ్రీవారి ప్రసాదాల తయారీకి కల్తీ నెయ్యి సరఫరా జరిగిందనేది ప్రధాన ఆరోపణ. ఈ వ్యవహారం రాష్ట్రంలో రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్, దర్యాప్తును వేగవంతం చేసింది. కేసులో కీలక ఆధారాలు సేకరించే పనిలో భాగంగా ఇప్పుడు కీలక వ్యక్తులను విచారించడంపై దృష్టి సారించింది. ఇప్పటికే ఈ కేసులో భాగంగా దర్యాప్తు అధికారులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు.

# నా తండ్రి బతికే ఉన్నాడు

**ధర్మేంద్ర మృతి వార్తలపై కుమార్తె ఈషా డియోల్**



ముంబై: ప్రముఖ బాలీవుడ్ నటుడు, 'హీ-మ్యాన్' ధర్మేంద్ర (89) ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తడంతో వారం రోజుల క్రితం ఆసుపత్రిలో చేరిన ఆయన, నిన్నటి నుంచి వెంటిలేటర్ పై చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన మరణించారంటూ మంగళవారం వార్తలు వ్యాపించడంతో ఆయన కుమార్తె, నటి ఈషా డియోల్ తీవ్రంగా స్పందించారు. ఈ వార్తలను ఖండిస్తూ, తన తండ్రి ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు. "మీడియా అనవసరమైన ఆత్రుతతో తప్పుడు వార్తలను ప్రచారం చేస్తోంది. నాన్న ఆరోగ్యం నిలకడగా ఉంది, ఆయన కోలుకుంటున్నారు. దయచేసి మా కుటుంబానికి కొంత ప్రైవసీ ఇవ్వాలని కోరుతున్నాం. నాన్న త్వరగా కోలుకోవాలని ప్రార్థించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు" అని ఈషా డియోల్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పోస్టుకు ఆమె కామెంట్స్ సెక్షన్‌ను కూడా డిసేబుల్ చేశారు. కుటుంబ సన్నిహిత వర్గాలు ఎన్డీటీవీకి తెలిపిన వివరాల ప్రకారం సోమవారం ధర్మేంద్ర ఆరోగ్యం మరింత క్షీణించింది. ఆయన పరిస్థితి ప్రస్తుతం ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆయన కంటికి శస్త్రచికిత్స చేయించుకున్నారు. ధర్మేంద్ర ఆసుపత్రిలో ఉన్నారన్న వార్త తెలియగానే ఆయన భార్య, బీజేపీ ఎంపీ హేమమాలిని, కుమారులు సన్నీ డియోల్, బాబీ డియోల్, మనవళ్లు కరణ్, రాజ్‌వీర్ డియోల్ సోమవారం రాత్రి ఆసుపత్రికి వెళ్లి ఆయన్ను పరామర్శించారు. అనంతరం హేమమాలిని కూడా ఇన్‌స్టాగ్రామ్‌లో స్పందిస్తూ, "ధరమ్ జీ ఆరోగ్యం కోసం ప్రార్థిస్తున్న అందరికీ ధన్యవాదాలు. ఆయన వైద్యుల నిరంతర పర్యవేక్షణలో ఉన్నారు. మేమంతా ఆయనతోనే ఉన్నాం" అని తెలిపారు. వీరితో పాటు షారుఖ్ ఖాన్, ఆయన కుమారుడు ఆర్యన్, సల్మాన్ ఖాన్, గోవిందా, అమీషా పటేల్ వంటి పలువురు బాలీవుడ్ ప్రముఖులు కూడా ఆసుపత్రికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. 'షోలే', 'ధరమ్ వీర్', 'చుప్కే చుప్కే' వంటి ఎన్నో ఐకానిక్ చిత్రాలతో ధర్మేంద్ర ప్రేక్షకులలో చెరగని ముద్ర వేశారు. ఆయన చివరిగా షాహిద్ కపూర్, కృతి సనన్ నటించిన 'తేరీ బాతో మే ఐసా ఉల్జా జియా' చిత్రంలో కనిపించారు. అమితాబ్ బచ్చన్ మనవడు అగస్త్య నంద హీరోగా నటిస్తున్న 'ఇక్కీస్' చిత్రంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా డిసెంబర్ 25న విడుదల కానుంది.

# అప్పుడు పవన్ ఎక్కడ?

**టీడీపీ నేత వద్ద లక్షల కిలోల గోమాంసం దొరికితే స్పందించలేదేం?**

**మాజీమంత్రి అంబటి రాంబాబు మండిపాటు**




తాడేపల్లి, నవంబర్ 11 (ఈవార్తలు): ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై వైసీపీ నేత అంబటి రాంబాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పవన్ కల్యాణ్ సనాతన ధర్మం గురించి మాట్లాడటం హాస్యాస్పదమని, ఆయన పూర్తిగా చంద్రబాబు చేతిలో రాజకీయ కీలుబొమ్మగా మారారని తీవ్ర ఆరోపణలు చేశారు. కేవలం చంద్రబాబు రాసిచ్చిన స్క్రిప్ట్‌ను అనుసరిస్తూ, ఆయన రాజకీయ ప్రయోజనాల కోసమే పవన్ పనిచేస్తున్నారని అంబటి ధ్వజమెత్తారు. "ఓ మై గాడ్... నిజంగా నాకు ఆశ్చర్యం వేస్తోంది. సనాతన ధర్మ యోధుడినని చెప్పుకునే పవన్ కల్యాణ్ గారు ఎట్టకేలకు తన సుదీర్ఘ నిద్ర నుంచి బయటకు వచ్చారు. కానీ ఆయన వచ్చింది న్యాయం కోసమో, ధర్మం కోసమో కాదు. కేవలం చంద్రబాబు తన రాజకీయ ప్రయోజనాల కోసం వాయించే ప్రచార డప్పుకు అనుగుణంగా డ్యాన్స్ చేయడానికి మాత్రమే! ఇది చూస్తుంటే నాకు నవ్వొస్తోంది. నేను సూటిగా అడుగుతున్నాను. తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు చనిపోయినప్పుడు ఈ ధర్మ పరిరక్షకుడు ఎక్కడికి వెళ్లారు? సింహాచలంలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయినప్పుడు ఈయన దైవాగ్రహం ఏమైంది? కాశీబుగ్గలో తొమ్మిది మంది అమాయకులు మరణించినప్పుడు ఈ మహాయోధుడు ఎందుకు కనిపించలేదు? ఒక్కటంటే ఒక్క సంఘటన జరిగిన చోటుకు ఆయన వెళ్లలేదు. ఒక్క మాట మాట్లాడలేదు. కనీసం ప్రగాఢ సానుభూతి కూడా ప్రకటించలేదు. ఒక ప్రజా నాయకుడి నుంచి కనీసం ఆశించే మానవత్వం కూడా చూపించకుండా, బాధిత కుటుంబాలను కలవకుండా ఏం సాధించారు? ఇక అసలు విషయానికి వద్దాం. విశాఖపట్నంలో టీడీపీ నేత సుబ్రహ్మణ్య గుప్తాకు చెందిన కోల్డ్ స్టోరేజ్‌లో 1,89,000 కిలోల గోమాంసం పట్టుబడినప్పుడు, సనాతన ధర్మాన్ని కాపాడతానని చెప్పే పవన్ కల్యాణ్ గారు మళ్ళీ మాయమైపోయారు. ఆ ఘటనపై ఆయనలో ఎలాంటి ఆగ్రహం లేదు, కనీసం ఖండన లేదు. కేవలం నిశ్శబ్దం, కపటత్వం మాత్రమే కనిపించాయి. కానీ ఈ రోజు, సరిగ్గా నవంబర్ 12న వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ తలపెట్టిన ర్యాలీలకు ముందు, పవన్ గారు అకస్మాత్తుగా మేల్కొన్నారు. వెంటనే 'ఎక్స్' లోకి వచ్చి చంద్రబాబు అందించిన పాత చింతకాయ పచ్చడి లాంటి స్క్రిప్ట్‌ను వల్లించడం మొదలుపెట్టారు. పవన్ గారూ, దీన్ని ధర్మం అనరు. ఇది నిస్సిగ్గుగా చంద్రబాబు చేతిలో కీలుబొమ్మలా మారి చేస్తున్న రాజకీయ నాటకం. ఇది మీ నిబద్ధతను, మీ సిద్ధాంతాలను మీరే అపహాస్యం చేసుకోవడం కాదా? జనం అన్నీ గమనిస్తున్నారన్న విషయం మీకు గుర్తుందా?" అంటూ అంబటి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

లవ్యారి చిత్రం



ప్రజ్ఞా సింగ్

## 'చికిరి'లో చరణ్ చింపేశాడు



కొన్ని రోజులుగా నెట్టింటిని షేక్ చేస్తున్న పెద్ది చికిరి చికిరి సాంగ్‌పై ఎక్స్‌లో ట్వీట్ చేశాడు వర్మ. సినిమాలోని ప్రతీ క్రాఫ్ట్ కేవలం హీరోను ఎలివేట్ చేసేలా మాత్రమే ఉండాలన్న వర్మ.. ఈ పాటలో రాంచరణ్ రా లుక్‌లో నిజంగా పేల్చేశాడంటూ కితాబిచ్చాడు. సినిమాలోని ప్రతీ క్రాఫ్ట్ అంటే డైరెక్షన్, మ్యూజిక్, సినిమాటోగ్రఫీతోపాటు మిగిలిన క్రాఫ్ట్స్ ముఖ్య ఉద్దేశం కేవలం హీరోను ఎలివేట్ చేయడమేనని.. చాలా కాలం తర్వాత పెద్ది సాంగ్‌లో రాంచరణ్‌లోని నిజమైన గ్రేస్‌ను చూశా.. బుచ్చిబాబు సాన టీంకు అభినందనలు తెలియజేస్తున్నానని ట్వీట్ చేశాడు వర్మ. ఇప్పుడీ ట్వీట్ నెట్టింట వైరల్ అవుతోంది. 'చికిరి చికిరి' సాంగ్‌లో రాంచరణ్ ఎనర్జీకి ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. రాంచరణ్ వేసిన మాస్ హుక్ స్టెప్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

## బెట్టింగ్ యాప్స్ విచారణకు విజయ్

ప్రముఖ సినీ నటుడు విజయ్ దేవరకొండ సీఐడీ సిట్ విచారణ ముగిసింది. బెట్టింగ్ యాప్‌లకు సంబంధించిన కేసులో సిట్ అధికారులు ఆయనను ప్రశ్నించారు. బెట్టింగ్ యాప్స్‌లకు ప్రచారం చేసిన వ్యవహారంలో విజయ్ సహా పలువురు ప్రముఖులకు అధికారులు నోటీసులు ఇచ్చారు. ఇందులో భాగంగా సిట్ అధికారులు విచారించారు. బెట్టింగ్ యాప్‌ల నుంచి తీసుకున్న పారితోషికం, కమీషన్ల విషయంలో సిట్ అధికారులు ప్రశ్నించినట్లు తెలుస్తున్నది.



దాదాపు గంటకుపైగా విజయ్ సీడీఐ కార్యాలయంలో ఉన్నాడు. విచారణ పూర్తయిన తర్వాత సీఐడీ కార్యాలయం వెనుక గేట్ నుంచి వెళ్లిపోయాడు. ఇదిలా ఉండగా.. విజయ్ దేవరకొండతో పాటు నటుడు ప్రకాశ్‌రాజ్‌కు ఇటీవ అధికారులు నోటీసులు ఇచ్చారు. బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో పలువురు ప్రముఖులను పోలీసులు విచారించిన విషయం తెలిసిందే. పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ సైతం కేసు నమోదు చేసింది. ఈ వ్యవహారంలో కొందరు నటీనటులను ప్రశ్నించింది. మరో వైపు ఇటీవల ఈడీ మాజీ క్రికెటర్లు సురేశ్ రైనా, శిఖర్ ధావన్‌కు సంబంధించిన రూ.11కోట్లకుపైగా ఆస్తులను జప్తు చేసిన విషయం తెలిసిందే.

## గిరిజ ఓక్.. కుర్రాళ్లు ఫసక్

సోషల్ మీడియాలో కొందరు స్టార్స్ తమ జీవిత కాలంలో తెచ్చుకోలేని గుర్తింపు కేవలం ఒక్క నైట్‌లో సాధించిన దాఖలాలు చాలా ఉన్నాయి. ఇప్పుడు అలాంటి ఫేమ్ ఓ సీరియల్ నటికి వచ్చింది. మరాఠి భాషల్లో పలు సీరియల్స్, సినిమాల్లో సైడ్ క్యారెక్టర్స్‌లో నటించింది నటి 'గిరిజ ఓక్'. ఈ పేరు కూడా చాలా మందికి తెలియకపోవచ్చు. కానీ, ఆమె ఇచ్చిన ఓ ఇంటర్వ్యూ ఆమెను ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మార్చేసింది. స్కై బ్లూ శారీకి మ్యాచింగ్‌గా స్లీవ్ లెస్ వైట్ బ్లౌజ్‌తో ఆమె ఇచ్చిన ఇంటర్వ్యూ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ఇంటర్వ్యూలో ఆమె కొన్ని ఇంట్రెస్టింగ్ విషయాలను మాట్లాడింది. ఇక ఈ ఇంటర్వ్యూకు సంబంధించిన ఆమె ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. గిరిజ ఓక్ గురించి కుర్రాళ్లు నెట్టింట తెగ వెతికేస్తున్నారు. అయితే, ఆమె వయసు 37 అని తెలుసుకుని వారు షాక్ అవుతున్నారు.



## సమంత మరో వ్యాపారం

సమంత జోరు పెంచేసింది.. ఇప్పటికే పెర్ఫ్యూమ్, బట్టల బ్రాండ్లను ఓపెన్ చేసి బిజినెస్ ఉమెన్ గా పేరు సొంతం చేసుకున్న ఈమె.. ఇప్పుడు మరో వ్యాపార రంగంలోకి అడుగుపెట్టి అందరిని ఆశ్చర్యపరిచింది. ఈ మేరకు ఈ విషయాన్ని అభిమానులతో పంచుకుంటూ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఒక వీడియోని కూడా షేర్ చేసింది సమంత. ఫ్యాషన్ నుండి వెల్నెస్ వరకు.. విద్య నుండి సూపర్ ఫుడ్స్ వరకు సమంత ప్రతిదానిలో కూడా తన దృష్టిని సారించి, తన టాలెంట్ ఏంటో నిరూపించుకుంది. అయితే అలాంటి ఈమె ఇప్పుడు మరో కొత్త లగ్జరీ దుస్తుల బ్రాండ్ తో తిరిగి వచ్చేసింది. ఇప్పటికే 2020లో సాకీ అనే దుస్తుల బ్రాండ్ ను స్థాపించడమే కాకుండా వినూత్నమైన ఫ్యాషన్ దుస్తులను ధరిస్తూ అందరినీ ఆకట్టుకున్న ఈమె.. ఇప్పుడు ట్రూలీ స్మా అనే పేరుతో మరో కొత్త బ్రాండ్ తో ప్రేక్షకులు ముందుకు వచ్చేసింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఇందుకు సంబంధించిన కలెక్షన్స్ ఫోటోలను పంచుకుంటూ.. "కొత్త అధ్యాయం ప్రారంభం అవుతుంది. నిజంగా స్మా ఇప్పుడు ప్రత్యక్షమైంది.. కచ్చితంగా ఈ దుస్తులు మీకు రెండవ చర్మంలా అనిపిస్తాయి" అంటూ తెలిపింది. ఇకపోతే ఈమె స్వయంగా సహ స్థాపించిన ఈ బ్రాండ్ దుస్తులు సులభంగా ధరించగలిగేదిగా స్టైలిష్ గా ఉండే సులభమైన లగ్జరీని అందిస్తాయని వాగ్దానం చేస్తోంది.






## పాలక్ ముచ్చల్.. మనసు వెన్న

బాలీవుడ్ ప్రముఖ గాయని పలక్ ముచ్చల్ మంచి మనసుతో గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించుకుంది. ఆర్థిక సాయం అందక గుండె సమస్యలతో బాధపడుతున్న దాదాపు 3,800 మందికి పైగా పేద పిల్లలకు గుండె శస్త్ర చికిత్సలు చేయిందేందుకు నిధులు సమకూర్చి గిన్నిస్ బుక్‌లో కెక్కింది సింగర్. పలక్ పలాష్ ఛారిటబుల్ ఫౌండేషన్ ద్వారా నిధులు సమకూర్చి నిరుపేద పిల్లలకు హార్ట్ సర్జరీలు చేయించింది ఈ సింగర్. అయితే ఈ విషయంపై ఇప్పటికే లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకున్న సింగర్.. తాజాగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకుంది. పలక్ ముచ్చల్ ఇండోర్‌లో జన్మించింది. ఒకసారి రైలు ప్రయాణంలో పేద పిల్లలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను చూసి చలించిపోయిన పలక్.. నిరుపేద చిన్నారుల కోసం ఏదైనా చేయాలన్న ఉద్దేశంతో ఈ సేవా సంస్థను స్థాపించింది.

## సెక్స్‌పై పాయల్ రాజ్‌పుత్ బోల్డ్ కామెంట్స్

ఆర్ఎక్స్ 100 సినిమాతో టాలీవుడ్ ఇండస్ట్రీలో బోల్డ్ బ్యూటీగా మారిపోయిన పాయల్ రాజ్ పుత్.. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొని సెక్స్ ఎడ్యూకేషన్‌పై కామెంట్స్ చేసింది. బోల్డ్ సీన్స్‌లో నటించడంపై మాట్లాడుతూ.. 'శృంగారం అనేది జీవితంలో భాగం. దీని గురించి మాట్లాడటానికి సిగ్గు పడాల్సిన అవసరం లేదు. ప్రతి ఒక్కరూ దీన్ని నార్మల్ మ్యాటర్‌గా తీసుకోవాలి. అలాగే సమాజంలో సెక్స్ ఎడ్యుకేషన్‌పై ప్రతీ వ్యక్తి సరైన అవగాహన కలిగి ఉండాలి. ముఖ్యంగా యువతకు సెక్స్ ఎడ్యుకేషన్ తప్పనిసరి. పీరియడ్స్ సమయంలో అమ్మాయిలు ఎదుర్కొనే ఫిజికల్ ఇష్యూస్, మానసిక ఇబ్బందుల గురించి సినిమాల్లో చూపించడం ద్వారా కొంత అవగాహన కల్పించాలనే ప్రయత్నం చేశాను. కండోమ్ వాడకం, సేఫ్టీ శృంగార జీవితం గురించి కూడా నా సినిమాల ద్వారా సందేహం ఇవ్వాలనుకున్నాను. అయినా ఇలాంటి విషయాలు దాచిపెట్టడం కంటే ఓపెన్‌గా చర్చించడం ద్వారా సమాజం మరింత అవగాహన పొందుతుంది' అని తెలిపింది.





చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే) మాజీ క్రికెటర్, వరల్డ్ కప్ విన్నర్ క్రిష్ శ్రీకాంత్ కుమారుడైన అనిరుధ శ్రీకాంత్.. తమిళ బిగ్ బాస్ బ్యూటీ సంయుక్తను పెళ్లి చేసుకోబోతున్నాడా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ప్రస్తుతం ఈ ఇద్దరూ రిలేషన్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. సోషల్ మీడియా వేదికగా షేర్ చేసిన ఓ పోస్ట్ ఈ వార్తలకు బలం చేకూరుస్తోంది. మోడల్‌గా కెరీర్ ప్రారంభించిన సంయుక్త.. 2007లో మిస్ చెన్నైగా నిలిచింది. తమిళ బిగ్ బాస్ సీజన్ 4తో మరింత క్రేజ్‌ను సంపాదించుకుంది. బిగ్ బాస్ సీజన్ తర్వాత ఆమెకు పలు చిత్రాల్లో నటించే అవకాశం లభించింది. తమిళ స్టార్ విజయ్ దళపతికి చెందిన వారిసు చిత్రంతో పాటు కాఫీ విత్ లవ్, తుగ్లక్ దర్బార్, మై డియర్ భూతం వంటి చిత్రాల్లో నటించింది. షార్ట్ ఫిల్మ్ డైరెక్టర్, ప్రోడ్యూసర్ అయిన కార్తీక్ శంకర్‌ను సంయుక్త ప్రేమించి పెళ్లి చేసుకుంది. ఈ ఇద్దరికి ఒక కుమారుడు కూడా ఉన్నాడు. కానీ వీరి కాపురం ఎక్కువ రోజులు కొనసాగలేదు. ప్రస్తుతం ఈ ఇద్దరూ విడాకులు తీసుకొని విడి విడిగా ఉంటున్నారని తెలుస్తోంది. తన కొడుకుతో కలిసి ఒంటరిగా ఉంటున్న సంయుక్త.. సీఎస్‌కే మాజీ క్రికెటర్ శ్రీకాంత్ అనిరుధ్‌తో రిలేషన్‌లో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ ఇద్దరికి ఎంగేజ్‌మెంట్ కూడా అయ్యిందని, త్వరలోనే పెళ్లి కూడా కాబోతున్నట్లు ప్రచారం జరుగుతుంది.

## బిగ్‌బాస్ బ్యూటీతో అనిరుధ పెళ్లి!



## రంజీల్లో జమ్ముకశ్మీర్ సంచలనం

**65 ఏళ్లలో ఢిల్లీపై తొలి విజయం**

రంజీ ట్రోఫీలో మరో సంచలనం నమోదైంది. మేఘాలయ బ్యాటర్ ఆకాశ్ కుమార్ చౌదరి ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీతో రికార్డు నెలకొల్పగా.. దేశవాళీలో పెద్ద జట్టైన ఢిల్లీపై జమ్ము కశ్మీర్ జయభేరి మోగించింది. 65 ఏళ్లలో మాజీ ఛాంపియపై ఆ జట్టుకు ఇదే తొలి విజయం. కమ్రాన్ ఇక్బాల్(133 నాటౌట్), అకీబ్ నబీ(5-35), వన్షాజ్ శర్మ(6-68) బంతితో చెలరేగడంతో దశాబ్దాల కలను సాకారం చేసుకుంది. చిరస్మరణ విజయంతో జమ్ము టీమ్ ఎలైట్ గ్రూప్ డీలో రెండో స్థానానికి ఎగబాకింది. రంజీ ట్రోఫీలో ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన జమ్ము కశ్మీర్ జట్టు ఢిల్లీకి ఊహించని షాకిచ్చింది. పటిష్టమైన ఢిల్లీ బ్యాటింగ్ లైనప్‌ను రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ జమ్ము బౌలర్లు తక్కువకే కట్టడి చేశారు. అకీబ్ నబీ(5-35), వన్షాజ్ శర్మ(6-68)లు విజృంభించి విజయానికి బాటలు వేశారు. అనంతరం 179 పరుగుల ఛేదనలో జమ్ము కశ్మీర్ ఓపెనర్ ఖమ్రాన్ ఇక్బాల్ (133 నాటౌట్) శతకంతో కదం తొక్కాడు. క్రీజులో పాతుకుపోయిన కమ్రాన్‌ను ఔట్ చేసేందుకు ఢిల్లీ బౌలర్లు తీవ్రంగా ప్రయత్నించినా లాభం లేకపోయింది. తొలి ఇన్నింగ్స్‌లో ఢిల్లీని అకీబ్ నబీ కోలుకోలేని దెబ్బ తీశాడు. టాపార్డర్ విఫలమైనా కెప్టెన్ అయుష్ బదొని(64), ఆయుష్ డొసెజా(65), సుమిత్ మథూర్(55) అర్ధ శతకాలతో జట్టును ఆదుకున్నారు. ఆఖర్లో అకీబ్ ముష్తాక్(2-30) తిప్పేయగా ఢిల్లీ 211కే ఆలౌటయ్యింది. అనంతరం ఇన్నింగ్స్ ఆరంభించిన జమ్ము కశ్మీర్ సారథి పరాస్ డోగ్రా(106), అబ్దుల్ సమద్(85)ల మెరుపులతో మూడొందలు కొట్టింది. రెండో ఇన్నింగ్స్‌లోనైనా పెద్ద స్కోర్ చేయాలనుకున్న ఢిల్లీ బ్యాటర్లను వన్షాజ్ శర్మ(6-68) వికెట్ వేటతో హడలెత్తించాడు. ఆయుశ్ బదొని(72), ఆయుశ్ డొసెజ్(65)లు పోరాడినా.. మిడిలార్డర్, టెయిలెండర్లను వన్షాజ్ పెవిలియన్ పంపగా 277కే ఢిల్లీ ఇన్నింగ్స్ ముగిసింది. ప్రత్యర్థి నిర్దేశించిన ఛేదనలో జమ్ము ఓపెనర్ కమ్రాన్ ఇక్బాల్(133 నాటౌట్) సెంచరీతో చెలరేగాడు. ఢిల్లీ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న అతడు.. 20 ఫోర్లు, 3 సిక్సర్లతో జట్టుక చిరస్మరణీయ విజయాన్ని కట్టబెట్టాడు.

## ఆ ఇద్దర్నీ ఆర్సీబీ వదిలేయాలి



ఆర్‌సీబీ ఫ్రాంచైజీ గురించి ఆకాశ్ చోప్రా కీలక వ్యాఖ్యలు చేశాడు. ఐపీఎల్ 2025 ఛాంపియన్‌గా నిలిచిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)లో పెద్దగా మార్పులు చేయాల్సిన అవసరం లేదని ఆకాశ్ చోప్రా అభిప్రాయపడ్డాడు. లియామ్ లివింగ్ స్టోన్, రసిఖ్ సలామ్ దార్ వదిలేస్తే జట్టు సెట్ అయిపోతుందని చెప్పాడు. 'ఆర్‌సీబీ లియామ్ లివింగ్ స్టోన్, రసిఖ్ సలామ్‌దార్‌ను వదిలేస్తే సరిపోతుంది. మిగతావారిలో ఎవరిని వదులుకోకూడదు. జట్టూ కూర్పు బాగున్నప్పుడు ఆటగాళ్లను వదిలేయాల్సిన అవసరం లేదు. ఈ సారి వారు రికార్డులు బద్దలు కొట్టారు. లివింగ్‌స్టోన్, రసిఖ్ సలామ్‌దార్‌లను తప్పా మిగతా వారిని రిలీజ్ చేయాల్సిన అవసరం లేదు. లివింగ్ స్టోన్‌ను చాలా ధర పెట్టి కొన్నారు. కానీ అతను ఆశించిన రీతిలో రాణించలేకపోయాడు. మిడిలార్డర్‌లో రజత్ పటీదార్‌కు తోడుగా మంచి బ్యాటర్‌ను తీసుకోవాలి. యశ్ దయాల్, భువనేశ్వర్ కుమార్, జోష్ హజెల్ వుడ్, రొమారియో షెఫెర్డ్, నువాన్ తుషార్‌లతో బౌలింగ్ విభాగం బలంగా ఉంది. బ్యాకప్ ఇండియన్ బౌలర్ కావాలనుకుంటే రసీఖ్‌ను వదిలేయవచ్చు. అతను అద్భుతమైన ఆటగాడే. అందులో ఎలాంటి సందేహం లేదు. కానీ అతను రూ. 6 కోట్ల భారీ ధర పలికాడు. ఆ డబ్బును వేరే ఆటగాడిపై ఖర్చు చేయవచ్చు. కృనాల్ పాండ్యా, సుయాష్ శర్మలతో స్పిన్ విభాగం కూడా పటిష్టంగానే ఉంది.'అని ఆకాశ్ చోప్రా చెప్పుకొచ్చాడు.



## షమి అన్ని ఫార్మాట్లూ ఆడాలి: గంగూలీ



పేసర్ మహ్మద్ షమి భారత్‌కు అన్ని ఫార్మాట్లలోనూ ఆడాలని మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ అన్నాడు. యూకేకి చెందిన ఏఐ క్రీడా శిక్షణ వేదికకు బ్రాడ్ అంబాసిడర్‌గా నియమితుడైన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ గంగూలీ ఇలా వ్యాఖ్యానించాడు. "రంజీ ట్రోఫీలో షమి బౌలింగ్ చూశా. అతడు ఎంతో ఫిట్‌గా ఉన్నాడు. అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నాడు. ఒంటిచేత్తో బెంగాల్‌ను గెలిపించాడు. రెండు మ్యాచ్‌ల్లో 15 వికెట్లు పడగొట్టాడు. ఈ ప్రదర్శనను సెలక్టర్లు చూశారనే అనుకుంటున్నా. వాళ్లు షమితో మాట్లాడుతూనే ఉంటారని భావిస్తున్నా. ప్రస్తుతం అతడు ఉన్న ఫామ్, ఫిట్‌నెస్ చూస్తే భారత్‌కు అన్ని ఫార్మాట్లలో ఆడగలడు. ముఖ్యంగా షమిని టెస్టుల్లో ఎందుకు తీసుకోవట్లేదో అర్థం కావట్లేదు" అని సౌరభ్ పేర్కొన్నాడు. దక్షిణాఫ్రికాతో తొలి టెస్టులో ధ్రువ్ జురెల్ తుది జట్టులో ఉండాలని దాదా అన్నాడు. "జురెల్ మెరుగ్గా ఆడుతున్నాడు. గాయం నుంచి కోలుకున్న రిషబ్ పంత్ కూడా పునరాగమనానికి సిద్ధమయ్యాడు. అతడు దక్షిణాఫ్రికాతో తొలి టెస్టులో ఆడడం ఖాయం. ఫామ్‌లో ఉన్న జురెల్‌కు కూడా అవకాశాన్ని కల్పించాలి. సుదర్శన్‌ను తప్పించి ఆ స్థానంలో జురెల్‌ను ఆడించడమే మార్గంగా కనిపిస్తోంది" అని గంగూలీ అన్నాడు.

## రోహిత్‌ను ముంబై వదులుకోదు

రోహిత్ శర్మను ముంబై న్స్ వదులుకుంటుంది అనే వార్త వినిపిస్తున్న తరుణంలో.. చెన్నై సూపర్ కింగ్స్ జట్టు మాజీ సభ్యుడు సురేశ్ రైనా కీలక వ్యాఖ్యలు చేశాడు. 'ముంబయి ఇండియన్స్ కచ్చితంగా రోహిత్‌శర్మను రిటైన్ చేసుకుంటుంది. ఆ జట్టు కోసం అతడు ఎన్నో ట్రోఫీలు గెలిచాడు. అయితే దీపక్ చాహర్‌ను వదులుకోవచ్చు లేదా రిటైన్ చేసుకోవచ్చు. ట్రెంట్ బౌల్ట్‌ను కూడా ముంబయి జట్టు రిటైన్ చేసుకోవాలి. అతడో అద్భుతమైన ప్లేయర్. వేలంలో ఆటగాళ్లను పొందకపోవచ్చు. కాబట్టి కచ్చితంగా నిలుపుకోవాలి' అని సురేశ్ రైనా ఓ స్పోర్ట్స్ ఛానల్‌తో అన్నాడు. రోహిత్ శర్మ.. కోల్‌కతా నైట్ రైడర్స్‌కు వెళ్లనున్నట్లు వస్తున్న వదంతులకు ముంబయి ఇండియన్స్ ముగింపు పలికింది. ఫ్రాంచైజీతో స్టార్ ఓపెనర్ అనుబంధం కొనసాగుతుందని సోషల్ మీడియాలో పోస్ట్ ద్వారా అభిమానులకు భరోసా ఇచ్చే ప్రయత్నం చేసింది. 'రేపు సూర్యుడు మళ్లీ కచ్చితంగా ఉదయిస్తాడు. కానీ 'నైట్' ఉదయించడం కష్టం మాత్రమే కాదు, అసాధ్యం కూడా..' అని ముంబయి ఇండియన్స్, రోహిత్.. కోల్‌కతా 'నైట్' రైడర్స్‌కు వెళ్లడు అనే అర్థం వచ్చేలా ఆ పోస్ట్‌లో పేర్కొంది.

## సంజూకు సీఎస్కే స్పెషల్ విషెస్



సంజు శాంసన్‌ను చెన్నై సూపర్‌కింగ్స్ జట్టులోకి తీసుకుంటోందనే వార్తలు వినిపిస్తున్న వేళ ఆసక్తికరమైన సంఘటన చోటుచేసుకుంది. చెన్నై సూపర్‌కింగ్స్ ఫ్రాంఛైజీ సోషల్ మీడియా వేదికగా సంజూకు బర్త్‌డే విషెస్ చెప్పింది. 'మోర్ పవర్ టూ యూ, సంజూ.. విషింగ్ యూ ఏ సూపర్ బర్త్‌డే' అంటూ పోస్ట్ చేసింది. దీంతో అతడు సీఎస్కేలోకి వస్తాడన్న వార్తలకు మరింత బలం చేకూరినట్లైంది. ఐపీఎల్ 2026కు ముందు చెన్నై సూపర్‌కింగ్స్.. ట్రేడ్ ద్వారా సంజుశాంసన్‌ను రాజస్థాన్ రాయల్స్ నుంచి తన గూటికి తెచ్చుకోవాలని చూస్తోందని తెలుస్తోంది. దానికి బదులుగా ఆల్‌రౌండర్లైన రవీంద్ర జడేజా, సామ్ కరన్‌ను రాజస్థాన్‌కు ఇస్తారనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై ఇప్పటివరకైతే ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఒకవేళ సంజుశాంసన్‌ను జట్టులోకి తీసుకున్నా, చెన్నై కెప్టెన్‌గా మాత్రం రుతురాజ్ గైక్వాడ్ కొనసాగే అవకాశముందని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ తన అభిప్రాయం వ్యక్తంచేశాడు. 'సంజు శాంసన్ చెన్నై తరఫున మొదటి సీజన్‌లోనే కెప్టెన్సీ దక్కించుకుంటాడని నేనైతే అనుకోవడం లేదు. ఒక ఆటగాడికి మొదటి సంవత్సరంలోనే ఫ్రాంఛైజీ కెప్టెన్సీ ఇవ్వకపోవచ్చు. రుతురాజ్ గైక్వాడే సారథిగా కొనసాగుతాడు. డీల్ కుదిరితే.. భవిష్యత్తులో మాత్రం తప్పకుండా సంజు శాంసన్‌ను సీఎస్కే కెప్టెన్‌గా చూస్తాం' అని అశ్విన్ అన్నాడు.

## అమరావతిలో ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడమీ!

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడమీ కానుంది. ఎం.ఎస్.కె ప్రసాద్ ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడమీ పేరుతో నిర్మాణం కానున్న ఈ అకాడమీకి సోమవారం భూమి పూజ జరిగింది. భూమి పూజలో రిటైర్డ్ భారత క్రికెట్ ఎం.ఎస్.కె ప్రసాద్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఎం.ఎస్.కె ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం 12 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు. ప్రపంచ స్థాయి క్రీడా శిక్షణ సముదాయంగా దీన్ని అభివృద్ధి చేస్తామని ఎం.ఎస్.కె ప్రసాద్ తెలిపారు. అకాడమీ ద్వారా స్థానిక క్రికెటర్లలో ప్రతిభను పెంపొందిస్తామన్నారు. అమరావతిలో క్రీడా మౌలిక వసతులను బలోపేతం చేస్తామని వివరించారు. అమరావతిలో నిర్మించనున్న సముదాయంలో అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన క్రికెట్ మైదానం, ప్రాక్టీస్ గ్రౌండ్లు, పూర్తి స్థాయిలో శిక్షణ సౌకర్యాలను కలిగి ఉంటుందన్నారు. అమరావతిలో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ క్యాంపస్లో ఆధునిక నెట్ లతోపాటు క్రీడాకారుల సామర్థ్య విశ్లేషణ వ్యవస్థలతో కూడిన ఇండోర్ ట్రైనింగ్ అకాడమీ ఉండనుంది. క్రీడలలో శిక్షణతో పాటు అంతర్జాతీయ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు కానుంది. క్రీడాకారులు, సందర్శక జట్ల కోసం వసతి, హాస్టల్ సౌకర్యాలు ఉంటాయి. స్థానికంగా టోర్నమెంట్ల నిర్వహణకు మినీ క్రికెట్ స్టేడియం అందుబాటులోకి వస్తుంది. అత్యాధునిక జిమ్ లు, ఫిజియోథెరపీ, పునరావాస కేంద్రాలు సేవలందిస్తాయి. ఫిట్నెస్ కోసం ఆధునిక ఫిట్నెస్ అండ్ కండిషనింగ్ సదుపాయాలు కలిగిన ఇండోర్, అవుట్ డోర్ ట్రైనింగ్ జోన్లు ఏర్పాటు కానున్నాయి. ఒలింపిక్ స్థాయి ప్రమాణాలతో ఈత కొలను, క్రీడాకారుల ఆరోగ్య సంరక్షణ సదుపాయాలు ఉంటాయి.




# ఊపిరితిత్తులు భద్రం

న్యుమోనియా.. శ్వాసకోశ ఇన్ఫెక్షన్‌గా పిలువబడే ఈ వ్యాధి, ప్రపంచవ్యాప్తంగా మరణాలకు ప్రధాన కారణాలలో ఒకటిగా మారుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజా నివేదిక ప్రకారం, ప్రతి సంవత్సరం సుమారు 2.5 మిలియన్ మంది న్యుమోనియాతో మరణిస్తున్నారు, వీరిలో 6 లక్షల మంది 5 ఏళ్ల లోపు పిల్లలు. భారతదేశంలోనే ఏటా 4 లక్షలకు పైగా కేసులు నమోదవుతున్నాయి, ఇది దేశంలోని మరణాలలో 15-20 శాతంగా ఉంటున్నాయి.

న్యుమోనియా పేరు చెబితేనే చాలా మంది భయపడిపోతారు. అంత ప్రాణాంతక వ్యాధి. ఊపిరితిత్తులు సంకోచానికి గురైపోతాయి. వాటిలో ఇన్ ఫ్లమేషన్ పెరిగిపోతుంది. అంటే..తిత్తులు రెండూ వాపునకు గురవుతాయి. అందులో ఫ్లూయిడ్ నిండిపోతుంది. ఈ కారణంగానే వాటి పని తీరుపై ప్రభావం పడుతుంది. అప్పటి నుంచి రకరకాల సమస్యలు వచ్చి కొన్ని సార్లు ఇది ప్రాణాంతకంగా మారుతుంది. ముఖ్యంగా పసి పిల్లల్లో ఈ మరణాలు ఎక్కువగా సంభవిస్తాయి. వృద్ధులకూ ఇది ముప్పుగా మారుతుంది. 65 ఏళ్లు పైబడిన వారిలో ఈ కాంప్లికేషన్స్ అధికంగా ఉంటున్నాయి. అయితే..న్యుమోనియాని సరైన సమయంలో గుర్తిస్తే ఇంత ఇబ్బంది ఉండదని చెబుతున్నారు వైద్యులు. ఈ జబ్బు వచ్చినప్పుడు శరీరంలో కొన్ని మార్పులు జరుగుతాయి. లక్షణాలు కనిపిస్తాయి. వాటిని బట్టి అప్రమత్తం కావచ్చు. నిర్లక్ష్యం చేస్తే మాత్రం ప్రాణాలు తీసేంత తీవ్రమవుతుంది. మరి ఆ సింప్టమ్స్ ఏంటి, అసలు న్యుమోనియా రావడానికి కారణాలేంటి? అంటే.. ఊపిరితిత్తుల్లో విపరీతంగా ఇన్ ఫ్లమేషన్ పెరిగినప్పుడు న్యుమోనియాకి దారి తీస్తుంది. రెండు తిత్తులూ వాపునకు గురి అవుతాయి. వీటిలో ఫ్లూయిడ్ లేదా శ్లేష్మం లాంటిది నిండిపోతుంది. దీని వల్లే ఎడతెరపి లేకుండా దగ్గు వస్తుంది. దగ్గుతో పాటు తెమడ కూడా విపరీతంగా వస్తుంది. అంతే కాదు. శ్వాస తీసుకోవడంలో చాలా ఇబ్బంది పడతారు. జ్వరం, వణుకు వేధిస్తాయి. వైరస్, బ్యాక్టీరియా లేదా ఫంగస్ కారణంగా న్యుమోనియా వచ్చే అవకాశం ఉంటుంది. అన్ని జబ్బులకు ఉన్నట్టే న్యుమోనియాకి కూడా దశలు ఉంటాయి. అంటే..ఒక్కో స్టేజ్ లో ఒక్కో విధంగా లక్షణాలు కనిపిస్తాయి. మైల్డ్ స్టేజ్ లో అంటే..మొదట్లోనే కనిపించే సింప్టమ్స్ ని గుర్తిస్తే చాలా సులువుగా బయటపడవచ్చు. ఎక్కువ రోజుల పాటు మెడికేషన్ లేకుండా అలా వదిలేస్తే మాత్రం దశలు దాటుకుంటూ వెళ్లి ప్రమాదకరంగా మారుతుంది. ఈ జబ్బుని ఎక్కువ రోజుల పాటు నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకంగా మారుతుంది. అయితే..మిగతా వారితో పోల్చి చూస్తే 65 ఏళ్లు పైబడిన వారికి ఈ వ్యాధి సోకుతుంది. అంతే కాదు. చిన్నారుల్లోనూ న్యుమోనియా వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉ ంటాయి. ఇమ్యూనిటీ తక్కువగా ఉండే వారు, ఇప్పటికే దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బంది పడేవారు కూడా రిస్క్ జోన్ లో ఉన్నట్టు లెక్క. అయితే..ఈ జబ్బులో దాదాపు నాలుగు రకాలున్నాయి. వీటిలో ముఖ్యంగా చెప్పుకోవాల్సింది వెంటిలేటర్ అసోసియేటెడ్ న్యుమోనియా, అస్పిరేషన్ న్యుమోనియా గురించి. ఆహారం లేదా డ్రింక్స్, లాలాజలం ద్వారా ఎక్కువ మొత్తంలో బ్యాక్టీరియా లేదా ఫంగస్ లోపలికి వెళ్లినప్పుడు ఈ రెండు రకాల న్యుమోనియా వచ్చే అవకాశం ఉ ంటుంది. న్యుమోనియా రావడానికి ప్రధాన కారణాలు బ్యాక్టీరియా, ఫంగస్ లేదా వైరస్ లు. వీటినే ప్యాథోజెన్స్ అంటారు.

ఇవి గాలి లేదా ఆహారం ద్వారా ఊపిరితిత్తుల్లోకి చేరుకుంటాయి. ఇవి చేరుకున్న వెంటనే ఊపిరితిత్తులు ఉబ్బుతాయి. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిలోనూ ఈ జబ్బు చాలా త్వరగా సోకే ప్రమాదం ఉంటుంది. విపరీతంగా కలుషిత గాలిని పీల్చడం, హానికరమైన రసాయనాలు గాలి ద్వారా లోపలికి వెళ్లడం లాంటివి జరిగినప్పుడు అది లంగ్స్ పై ప్రభావం చూపించి న్యుమోనియాకి దారి తీస్తుంది. ఎక్కువ రోజుల పాటు హాస్పిటల్ లో ఉండడం, అక్కడి గాలి పీల్చడం లాంటివి కూడా కొన్ని సార్లు న్యుమోనియాకి దారి తీస్తుండొచ్చు. న్యుమోనియా వచ్చినప్పుడు కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. వాటిని సరైన విధంగా గుర్తిస్తే చాలా త్వరగా ఈ ముప్పు నుంచి బయటపడవచ్చు. ఈ వ్యాధి సోకినప్పుడు ఛాతిలో విపరీతంగా నొప్పి వస్తుంది. దీంతో పాటు శ్వాస తీసుకోడానికి ఇబ్బందిగా అనిపిస్తుంది. దగ్గు వస్తుంది. పెద్ద వారిలో అయితే మతిమరుపు కూడా వచ్చే అవకాశం ఉంటుంది. దగ్గుతో పాటు తెమడ విపరీతంగా వస్తుంది. తరచూ చెమట పట్టడం, జ్వరం, నీరసం, కళ్లు తిరిగినట్టుగా అనిపించడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. అప్పుడప్పుడు వణుకు వస్తుంది. పిల్లలతో పోల్చి చూస్తే పెద్ద వారిలో బాడీ టెంపరేచర్ అబ్ నార్మల్ గా ఉంటుంది. వాంతులు, డయేరియా లాంటివి కూడా ఇబ్బంది పెడతాయి. ఈ లక్షణాలన్నీ కనిపిస్తే వీలైనంత త్వరగా అప్రమత్తం అవడం మంచిది. వెంటనే డాక్టర్ ని సంప్రదిస్తే ముందస్తుగానే ముప్పు నుంచి తప్పించుకోవచ్చు. న్యుమోనియాని తగ్గించేందుకు కొన్ని రకాల టీకాలు అందుబాటులో ఉన్నాయి. కానీ..పరిస్థితి అక్కడి వరకూ రాకుండా చూసుకోవడమే మంచిది. న్యుమోనియా రాకుండా ఉండాలంటే కచ్చితంగా శుభ్రత పాటించాలి. ముఖ్యంగా చేతులు ఎప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలి. తరచూ సబ్బు నీటితో చేతులు కడుక్కోవడం మంచిది. దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు మిగతా వారికి ఇబ్బంది లేకుండా మోచేతిని అడ్డు పెట్టుకోవాలి. సిగరెట్ తాగే అలవాటు ఉంటే వెంటనే మానేయడం మంచిది. దీని వల్ల ఊపిరితిత్తులు చాలా త్వరగా పాడైపోతాయి. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటూ సరైన నిద్ర ఉండేలా చూసుకుంటే ఇబ్బంది ఉండదు.

# మీలోనూ హనుమంతుడు!

జీవితంలో ప్రతి మనిషికీ ఒక లక్ష్యం ఉండాలి. అదే లేకపోతే మన ప్రస్థానం దిక్కుతెలియని పడవలా అయిపోతుంది. లక్ష్యసాధన అంటే గమ్యాన్ని చేరుకోవడానికి మనం చేసే ప్రయాణం, పడే శ్రమ. లక్ష్యం స్థిరంగా ఉండాలి. సాధన దృఢంగా ఉండాలి. అప్పుడే లక్ష్యాన్ని చేరుకోగలం. ద్రోణాచార్యుడు తన శిష్యులకు ఒక పరీక్ష పెడతాడు. ఒక పెద్ద చెట్టు పైన చిట్టచివరి కొమ్మల్లో ఒక పక్షి కూర్చుని ఉంది. దాని కంటిని బాణంతో కొట్టాలన్నది పరీక్ష. ముందుగా ధర్మరాజు వచ్చాడు.




చెట్టుమీద ఏం కనిపిస్తోందని అడిగాడు ద్రోణుడు. 'చెట్టు, చెట్టుమీద పక్షి, ఆకాశం, పక్షికి చుట్టూ ఆకులు ఉన్నాయి' అన్నాడు యుధిష్ఠిరుడు. సరే... నువ్వు వెనక్కి వెళ్లు అని చెప్పి భీముణ్ని పిలిచి అదే ప్రశ్న అడిగాడు. చెట్టు, కొమ్మలు, పక్షి, ఆకాశం.. చెప్పాడు భీముడు. ఇలా అందరూ అదే సమాధానం చెప్పడం, గురువు వాళ్లను తిప్పి పంపడం జరిగింది. చివరికి అర్జునుణ్ని పిలిచి అందర్నీ అడిగిన ప్రశ్నే అతణ్ని అడిగాడు. అర్జునుడు నిశ్చలంగా 'నాకు కేవలం పక్షి కన్నే కనబడుతోంది. ఇంకేం కనబడటంలేదు అని చెప్పాడు. ద్రోణాచార్యుడు చిరునవ్వుతో 'బాణం వెయ్యి అర్జునా' అన్నాడు. మరుక్షణం అర్జునుడి ధనుస్సులోంచి బాణం దూసుకు పోయింది. పక్షి నేలకూలింది. అక్కడ లక్ష్యం పక్షి కన్ను కొట్టడం. అంటే మనకు అదే కనబడాలి తప్ప ఇంకేవీ కనిపించకూడదు. అంత స్థిరమైన దృష్టి కోణం ఏర్పరచుకున్నప్పుడే ఎవర మైనా లక్ష్యాన్ని చేరుకోగలుగుతాం. సీత్తు అర్జునుడి లక్ష్యం పక్షి కన్ను లాగా మనకీ మన లక్ష్యం ఏంటో కచ్చితంగా తెలియాలి. దాని పైనే దృష్టి నిలపాలి. లక్ష్యసాధనకు కావాల్సింది స్పష్టమైన దృష్టి, ఏకాగ్రత. లక్ష్యం చిన్నదైనా, పెద్దదైనా.. దాన్ని చేరాలంటే మనసు, శక్తి, శ్రద్ధ అన్నీ ఒకే బిందువులో కలిసి ఉండాలి. అడ్డంకులను అధిగమించాలే కానీ లక్ష్యం నుంచి వెనక్కి మళ్లకూడదు. రామరావణ యుద్ధంలో లక్ష్మణుడు గాయపడ్డాడు. వైద్యుడు సుషేణుడు వచ్చి చూసి హిమాలయాల్లో ఉన్న సంజీవనిని తెస్తేనే లక్ష్మణుడి ప్రాణాలు నిలబడతాయని చెప్పాడు. హనుమంతుడు ఒక్క క్షణం ఆలస్యం చేయకుండా హిమాలయాలకు దూసుకెళ్లాడు. అక్కడ సంజీవని ఏదో తెలియలేదు. అందుకని ఆయన తల పట్టుకుని కూర్చోలేదు. ఏ చెట్టో తెలియదు కాబట్టి మొత్తంగా పర్వతాన్నే పెకిలించుకు తీసుకెళ్లాడు. లక్ష్మణుడి ప్రాణాలను కాపాడాడు. నిత్యజీవితంలో మనకూ ఎన్నో సవాళ్లు ఎదురవుతుంటాయి. వాటికి వెరచి వెనక్కి తగ్గవద్దని చెబుతుంది హనుమంతుడి దివ్యగాథ. ఆనాడే కాదు, ఈనాడైనా లక్ష్యసాధనకు పట్టుదలే ప్రధానం. అవసరమైతే పర్వతాన్నే మోయగల శక్తి మనలోని సంకల్పానికి ఉంటుంది. హనుమంతుడు మనలోనూ ఉన్నాడు. ఆ సత్యం తెలుసుకుని లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దానివైపు బలంగా అడుగేసినప్పుడు ఆయన తారసపడతాడు.

**- అలేఖ్య కట్కం**

# గాంధీ చివరి ప్రసంగం

మహాత్మాగాంధీ ఢిల్లీ ఆకాశవాణి కేంద్రాన్ని సందర్శించిన చరిత్రాత్మకమైన రోజును ఏటా 'పబ్లిక్ సర్వీస్ బ్రాడ్‌కాస్టింగ్ డే' గా జరుపుకుంటున్నాం. దేశవిభజనానంతర కల్లోలంలో బాధితులైన శరణార్థులను ఉద్దేశించి 1947 నవంబర్ 12న గాంధీజీ ఎంతో ఆవేదనగా రేడియోలో ప్రసంగించారు. రేడియోలో మహాత్ముడి మొదటి, చివరి ప్రసంగం కూడా అదే. ఈ ప్రసంగం భారతదేశ సామాజిక నిర్మాణంలో, ముఖ్యంగా సమాజంలోని గ్రామీణ, అట్టడుగు వర్గాల గొంతులను అనుసంధానించడంలో, ఉద్ధరించడంలో, మీడియా, కమ్యూనికేషన్‌లో గాంధేయ విలువల శాశ్వత వారసత్వాన్ని కాపాడడంలో ప్రజా ప్రసారం కీలక పాత్రను గుర్తు చేస్తుంది.

విభజన తర్వాత, లక్షలాది మంది హిందువులు, సిక్కులు పాకిస్తాన్ నుండి కొత్తగా స్వతంత్ర భారతదేశానికి వలస వెళ్ళవలసి వచ్చింది. ఈ శరణార్థులలో చాలా మంది తమ ఇళ్ళు, ఆస్తులు, సమాజాలను వదిలి ఢిల్లీ అంతటా శిబిరాల్లో ఉంచబడ్డారు. వారి దుస్థితి చూసి తీవ్రంగా చలించిపోయిన గాంధీ, ప్రతి శిబిరంలో తన భౌతిక ఉనికి సాధ్యం కాదని గ్రహించి, ఈ శరణార్థులను నేరుగా ఉద్దేశించి మాట్లాడాలని నిర్ణయించుకున్నాడు. రేడియో ద్వారా, గాంధీ ఈ ప్రజలను చేరుకుని, వారికి ఓదార్పు, సంఘీభావాన్ని అందించగలిగాడు. తన ప్రసంగంలో, ఆయన సానుభూతి, కరుణ, ప్రోత్సాహాన్ని వ్యక్తం చేశారు, ఇటువంటి క్లిష్ట సమయాల్లో శరణార్థులు స్థితిస్థాపకంగా ఉండాలని కోరారు. ఈ ప్రసారం భారతదేశ స్వాతంత్ర్యానంతర చరిత్రలో ఒక హృదయ విదారక క్షణంగా గుర్తుండిపోతుంది, ఈ కారుణ్య చర్యను గౌరవించడానికి పబ్లిక్ సర్వీస్ బ్రాడ్‌కాస్టింగ్ దినోత్సవాన్ని జరుపుకుంటారు. భారతదేశంలో ప్రజా ప్రసారాల పాత్ర: ప్రజా సేవా ప్రసార దినోత్సవం భారతదేశ ప్రజా ప్రసార వేదికలైన ఆల్ ఇండియా రేడియో, దూరదర్శన్, ప్రజలకు సమాచారం, విద్య, వినోదాన్ని అందించడంలో పాత్రను అభినందించడానికి ఒక సందర్భంగా ఉపయోగపడుతుంది. 1936లో తన ప్రయాణాన్ని ప్రారంభించిన ఆలిండియా రేడియో.. 1959లో ప్రారంభించబడిన దూరదర్శన్, భారతదేశ ప్రజా సేవా మీడియాకు రెండు స్తంభాలు, ఇవి దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాయి. భారతదేశంలో ప్రజా ప్రసారం సమ్మిళితత్వం, ప్రాప్యత ఆదర్శాలపై ఆధారపడి ఉంటుంది, వాణిజ్య మీడియా తరచుగా ప్రవేశించలేని మారుమూల, గ్రామీణ ప్రాంతాలకు చేరుకుంటుంది. ముఖ్యంగా గ్రామీణ భారతదేశంలో ఆలిండియా రేడియో వ్యాప్తి గాంధీ సూత్రాలకు దగ్గరగా ఉంటుంది. భారతదేశ ఆత్మ దాని గ్రామాలలోనే ఉందని మహాత్మా గాంధీ గట్టిగా విశ్వసించారు. అభివృద్ధి పట్ల ఆయన దార్శనికతలో గ్రామీణ వర్గాలకు సాధికారత కల్పించడం కూడా ఉంది, అనేక విధాలుగా, గ్రామీణ జనాభాకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడం ద్వారా ఆలిండియా రేడియో ఈ దార్శనికతను సజీవంగా ఉంచుతూనే ఉంది. వ్యవసాయ పద్ధతులు, ఆరోగ్య సలహాలు, విద్యా కార్యక్రమాలు, వాతావరణ నవీకరణలకు సంబంధించిన కార్యక్రమాలు దేశవ్యాప్తంగా లక్షలాది మందికి, ముఖ్యంగా మారుమూల ప్రాంతాల వారికి జీవనాధారంగా ఉన్నాయి. గాంధీ కాలం నుండి భారతదేశంలో ప్రజా ప్రసారం చాలా మార్పులకు లోనైంది. 1997లో ప్రసార భారతి స్థాపనతో, ప్రభుత్వ ప్రభావం నుండి స్వాతంత్ర్యం కల్పించే లక్ష్యంతో ఆలిండియా రేడియో, దూరదర్శన్ ఒక స్వయంప్రతిపత్తి చట్టబద్ధమైన సంస్థ కిందకు వచ్చాయి. ఈ స్వయంప్రతిపత్తి ప్రసార భారతిని వాణిజ్య ప్రసారకుల నుండి వేరు చేస్తూ, లాభాల ఆధారిత అజెండాలపై మాత్రమే కాకుండా ప్రజా ప్రయోజనాలపై దృష్టి సారించి పనిచేయడానికి అనుమతిస్తుంది. అయితే, దాని వారసత్వం, పరిధి ఉ న్నప్పటికీ, ప్రజా ప్రసారం నేడు అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు, ప్రైవేట్ మీడియా ఆధిపత్యం చెలాయించే యుగంలో, ఆలిండియా రేడియో, దూరదర్శన్ తగ్గుతున్న వీక్షకుల సంఖ్య, అనేక వినోద ఎంపికల నుండి పోటీని ఎదుర్కొంటున్నాయి. నిధుల పరిమితులు, ఇంటర్నెట్ ఆధారిత కంటెంట్ వైపు వేగంగా మారడం వలన వాటి ఆవిష్కరణ, విస్తరణ సామర్థ్యం మరింత దెబ్బతింటుంది. అయినప్పటికీ, పబ్లిక్ బ్రాడ్‌కాస్టర్లు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను స్వీకరించడం ద్వారా కొంతవరకు అలవాటు పడ్డారు. ఉదాహరణకు, ఆలిండియా రేడియో,



దూరదర్శన్ కార్యక్రమాలు ఇప్పుడు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయి, ఇది యువ ప్రేక్షకులను, పట్టణ శ్రోతలను చేరుకోవడానికి వారికి సహాయపడుతుంది. అయినప్పటికీ, వారి ప్రాథమిక ప్రేక్షకులు గ్రామీణ ప్రాంతాలే, ఇక్కడ సాంప్రదాయ రేడియో, టెలివిజన్ అత్యంత ప్రాప్యత చేయగల మీడియా రూపాలుగా కొనసాగుతున్నాయి.

**- గంగాధర్**

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.